PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 144 | విజయవాడ, బుధవారం 27 డిసెంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 27 December 2023 | Rs

ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి

2

క్రీడా వజ్రాలను తయారు చేస్తాం

- 'ఆడుదాం ఆంధ్ర' ప్రారంభోత్సవంలో జగన్
- అందరూ వ్యాయామం చేయాలని పిలుపు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

క్రీడా జ్యోతిని క్రీడాకారిణి రమాదేవికి అందిస్తున్న సిఎం జగన్

రాష్ట్రంలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించేందుకు 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం చేపట్టినట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తెలిపారు. గుంటూరు సమీపంలోని నల్లపాడు వద్ద ఉన్న లయోలా పబ్లిక్ స్కూల్ క్రీడా మైదానంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్రా-2023 పోటీలను ఆయన మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. తొలుత క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ బేసిక్, ప్రొఫెషనల్ కిట్లను, విజేతలకు అందించే ట్రోఫీలను పరిశీలించారు. శాప్ పతాకాన్ని, జాతీయ జెండాను ఆవిష్కరించారు. క్రీడా జ్యోతిని వెలిగించారు. క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. బెలూన్లు ఎగురవేసి ఆడుదాం ఆంధ్రా 2023 క్రీడా పోటీలను ప్రారంభించారు. సచివాలయ స్థాయిలో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే పురుష, మహిళ క్రీడాకారులకు బేసిక్ కిట్లను అందించారు. లయోల పబ్లిక్ స్కూల్ ఆవరణలోని క్రీడా మైదానంలో ఖో-ఖో, క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్ మహిళా, పురుషుల టీముల సభ్యులను ముఖ్యమంత్రి పరిచయం చేసుకున్నారు. ముఖ్యమంత్రి క్రికెట్ బ్యాటింగ్, బ్యాడ్మింటన్, వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ క్రీడలను సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించడం ద్వారా గ్రామాల్లోని ఆణిముత్యాలను వెతికి సానబెట్టి వజ్రంగా మలచి దేశానికి అంతర్రాష్ట్రీయంగా విద్యార్థులను తీర్చిదిద్దుతామని వివరించారు. సచివాలయ స్థాయి నుంచి మండల స్థాయికి, ఆ తర్వాత నియోజకవర్గ స్థాయికి వచ్చే టీములను జిల్లా, రాష్ట్ర స్థాయికి తీసుకువెళతామన్నారు. క్రీడల్లో ప్రతిభ కలిగిన ఆణిముత్యాలను వెతికేందుకు ప్రొఫెషనల్ లీగ్‌లో ఉన్న టీములన్నీ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేస్తాయని తెలిపారు.

క్రికెట్‌కు సంబంధించి చెన్నై సూపర్ కింగ్స్ ముందుకొచ్చిందన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ క్రీడాకారులను తీర్చిదిద్దుతుందని వివరించారు. బ్యాడ్మింటన్‌కు సంబంధించి కిడాంబి శ్రీకాంత్, పివి సింధూ సహకారంతో మెరుగైన క్రీడాకారులను తీర్చిదిద్దుతామన్నారు. వాలీబాల్‌కు సంబంధించి ప్రైమ్ వాలీబాల్, కబడ్డీకి సంబంధించి ప్రో కబడ్డీ ఆర్గనైజర్లు ముందుకు వచ్చారని తెలిపారు. 'ఆడుదాం ఆంధ్ర' ఏటా డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకు కొనసాగుతుందన్నారు. సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయిలో 34.19 లక్షల మంది క్రీడాకారులు, 88.66 లక్షల మంది ప్రేక్షకులుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని సిఎం తెలిపారు. 15 వేల సచివాలయాల పరిధిలో 9 వేల ఆట స్థలాలను గుర్తించామన్నారు. రాష్ట్ర మంత్రులు ఆర్‌కె రోజా, విడదల రజనీ, అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, ఎంపిలు నందిగం సురేష్, ఆళ్ల ఆయోధ్య రామిరెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ సిద్దార్థ రెడ్డి, జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికి మతాన్ని వాడొద్దు

- అయోధ్యలో కార్యక్రమానికి సిపిఎం దూరం
- పొలిట్‌బ్యూరో ప్రకటన

న్యూఢిల్లీ : అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా సిపిఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరుకావడం లేదని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో తెలిపింది. మత విశ్వాసాలను గౌరవించడం, ప్రతి వ్యక్తి తమ విశ్వాసానికి అనుగుణంగా నడుచుకునే హక్కును కాపాడడం సిపిఐ(ఎం) విధానం. మతాన్ని రాజకీయ లబ్ధి కోసం సాధనంగా మార్చకూడదు. అది వ్యక్తిగత ఎంపిక అని సిపిఐ(ఎం) నమ్ముతుంది. అందుకే, ఆ ఆహ్వానాన్ని తిరస్కరిస్తూ, ఏచూరి ఈ కార్యక్రమంలో పాల్గొనబోవడం లేదని పొలిట్‌బ్యూరో తెలిపింది. ప్రధాన మంత్రి, యుపి ముఖ్యమంత్రి, ఇతర ప్రభుత్వ అధికారులు ప్రత్యక్ష భాగస్వామ్యంతో మత పరమైన వేడుకను ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమంగా బిజెపి, ఆరెస్సెస్‌లు మార్చడం అత్యంత దురదృష్టకరమని పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. 'రాజ్యాంగం ప్రకారం పాలనా నిర్వహణ వ్యవహారాల్లో మతప్రమేయం ఉండకూడదని సుప్రీం కోర్టు ఇదివరకే ఉద్ఘాటించింది. భారత దేశంలో ప్రభుత్వ పాలనకు సంబంధించిన మౌలిక సూత్రమిది. ఈ కార్యక్రమ నిర్వహణలో ప్రభుత్వం ఈ సూత్రాన్ని ఉల్లంఘించింది' అని సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో విమర్శించింది.

తెరపైకి మరో స్పైవేర్

లోపలి పేజీలో..

బుజ్జగింపులు.. బెదిరింపులు

- ప్రభుత్వ వైఖరితో చర్చలు మళ్లీ విఫలం
- సమ్మె ఉధృతం చేస్తామన్న అంగన్‌వాడీ సంఘాలు
- కార్మికులను సంఘటితం చేస్తాం : సిఐటియు

సచివాలయంలో జరిగిన చర్చల్లో పాల్గొన్న మంత్రి బొత్స, సజ్జల, సిఎస్ జవహర్ రెడ్డి, అంగన్‌వాడీ సంఘాల నేతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీ సంఘాలతో జరిపిన చర్చల్లో ప్రభుత్వం ఒకవైపు బుజ్జగిస్తూనే, మరోవైపు బెదిరింపులకు దిగింది. అంగన్‌వాడీలవి న్యాయమైన కోరికలని చెబుతూనే కీలకమైన డిమాండ్ల పట్ల నాన్చుడు వైఖరిని అవలంభించింది. అదే సమయంలో సమ్మెను విరమించి, విధుల్లో చేరకపోతే 'ఏం చేయాలో అది చేస్తాం' అంటూ బెదిరింపులకు దిగింది. దీంతో చర్చలు మళ్లీ విఫలమయ్యాయి. సమ్మెను విరమించేది లేదని, ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ సంఘాలు ప్రకటించాయి. అంగన్‌వాడీ సంఘాలు నిర్వహిస్తున్న సమ్మె 15 రోజులు గడిచిన నేపథ్యంలో మంగళవారం ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. గతంలో మాట్లాడిన అంశాలనే తాజా చర్చల్లోనూ మంత్రులు, అధికారులు మళ్లీ మాట్లాడారు.

కీలకమైన గ్రాట్యుటీ, జీతాల పెంపుపై అంగుళం కూడా ముందడుగు వేయడానికి సిద్ధపడలేదు. ఈ అంశాలపై ముఖ్యమంత్రితో మాట్లాడలేదని మంత్రి మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు దీనికి సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు అంశాలపైనే స్పష్టత ఇవ్వాలని కోరగా రాత్రి ఎనిమిది గంటల వరకూ తేల్చలేదు. దీంతో చర్చలు విఫలమయ్యాయని సంఘాల నాయకులు ప్రకటించారు. అయితే చర్చల సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ ఒకవైపు బుజ్జగిస్తూనే, బెదిరింపు ధోరణితో మాట్లాడారు. విధుల్లోకి చేరకపోతే ప్రభుత్వం ఏమి చేయాలో అది చేస్తుందని జనవరి ఒకటవ తేదీ తరువాత ఏం జరుగుతుందో చూడండని బెదిరింపు ధోరణితో మాట్లాడారు. . అలాగే సిఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ సమ్మె సంక్రాంతి వరకూ వాయిదా వేసుకోవాలని చెబుతూనే జీతాలు పెంచే ప్రసక్తిలేదని తేల్చిచెప్పారు. దీనిపై అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలైన డిమాండ్లు పరిష్కరించకుండా ఎన్నికల అనంతరం ప్రభుత్వం వచ్చిన తరువాత వీటి గురించి ఆలోచిస్తామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. చర్చల్లో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) నాయకులు కె.సుబ్బరావమ్మ, బేబీరాణి, సుప్రజ, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్(ఎఐటియుసి) నాయకులు జె.లలితమ్మ, కె.ప్రేమ, ఫ్లారెన్స్, ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(ఐఎఫ్‌టియు) రాష్ట్ర నాయకులు వి.ఆర్.జ్యోతి, గంగావతి, భారతి హాజరయ్యారు. ప్రభుత్వం తరుపున మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, స్త్రీ శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి(హెచ్‌ఆర్) చిరంజీవి చౌదరి, స్త్రీ శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ విజయకృష్ణన్ తదితరులు హాజరయ్యారు.

విధుల్లోకి రాకపోతే చర్యలు : బొత్స

ఒకటోతేదీ నుండి జగనన్న కిట్లు అందించాలని, 5వ తేదీలోపు విధుల్లో చేరకపోతే ప్రభుత్వం ఏమి చేయాలో అది చేస్తుందని మంత్రి బొత్స సత్యనారాయణ హెచ్చరించారు. దీనిపై అంగన్‌వాడీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. 15 రోజుల నుండి సమ్మె కొనసాగుతుంటే కీలకాంశాలపై చర్చించకుండా బెదిరింపులకు దిగడం ఏమిటని వారు ప్రశ్నించారు. అనంతరం మీడియాతో బొత్స మాట్లాడుతూ అంగన్‌వాడీలు గౌరవవేతనం పెంచాలని డిమాండు చేశారని, తాము సమయం అడిగామని తెలిపారు. పండగ వరకూ వాయిదా వేసుకోవాలని సిఎస్ కోరారని, అయినా వారు వేతనం గురించే పట్టుబట్టారని మిగతా 2లో

కోవిడ్ లక్షణాలతో విశాఖలో మహిళ మృతి

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖలో ఓ మహిళ కోవిడ్ పాజిటివ్‌తో మృతి చెందిందన్న వార్త ప్రజలను కలవరపరిచింది. విశాఖ నగరంలోని కంచరపాలేనికి చెందిన మహిళ (51) ఈ నెల 22న అక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సింట్రోమ్‌తో పాటు తీవ్రమైన కిడ్నీ ఫెయిల్యూర్ సమస్యతో, మల్టీ ఆర్గాన్ డిస్ఫంక్షన్ సింట్రోమ్‌తో బాధపడుతూ ఛాతీ ఆస్పత్రిలో చేరారు. ఆమెకు పరీక్షలు చేయగా ఆర్‌టిపిసిఆర్‌లో కోవిడ్ పాజిటివ్ వచ్చింది. అనంతరం ఆమెను డయాలిసిస్ కోసం కెజిహెచ్‌కు ఈ నెల 24న తరలించారు. మంగళవారం ఉదయం ఆమె మృతి చెందారు. కోవిడ్‌తోనే ఆమె మరణించినట్టు ప్రచారం జరిగింది

కోవిడ్ మరణమని భావించరాదు : కెజిహెచ్

ఆమెది కోవిడ్ మరణమని భావించరాదని కెజిహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఆమె ఆస్పత్రిలో చేరాక ఉత్తమ చికిత్స అందించామని తెలిపారు. ఆమె మరణానికి ముందే చాలా వ్యాధులతో బాధపడుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వాటి వల్ల సంభవించిన మరణమే తప్ప, కేవలం కోవిడ్ వల్ల మాత్రమేనని భావించరాదని నిపుణులు అభిప్రాయపడుతున్నట్టు ఓ ప్రకటనలో తెలిపారు. మృతురాలి కోవిడ్ పరీక్షా ఫలితాలను జినోమ్ నిర్ధారణకు విజయవాడ సెంట్రల్ లేబొరేటరీకి పంపించామని, వాటి ఫలితాల కోసం వేచి చూస్తున్నామని పేర్కొన్నారు. కోవిడ్ కేసుల పట్ల ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రజలంతా తగు జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుందని అన్నారు.

ఉమ్మడి విజయనగరంలో కరోనా కేసులు

పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం జిల్లాల్లో తొలి కరోనా కేసులు నమోదయ్యాయి. పార్వతీపురం మన్యం జిల్లా జియమ్మవలస మండలం కుందరతిరువాడకు చెందిన ఓ మహిళ భర్త ఇటీవల శబరిమలకు వెళ్లి వచ్చారు. తమ బంధువులకు ప్రసాదాలు పంచే క్రమంలో బైక్ యాక్సిడెంట్‌లో ఆమె గాయపడ్డారు. వైద్యం కోసం విశాఖకు వెళ్లగా..అక్కడ పరీక్షించిన వైద్యులు ఆమెకు కరోనా సోకినట్లు నిర్ధారించారు. విజయనగరం జిల్లా డెంకాడ మండలానికి చెందిన ఓ మహిళ అనారోగ్యంతో విజయనగరంలో ఓ ఆస్పత్రికి వెళ్లారు. వైద్యుల సూచన మేరకు విశాఖ కెజిహెచ్‌కు వెళ్లారు. అక్కడ పరీక్షలు చేయగా కరోనా సోకినట్లుగా నిర్ధారించామని డిఎంహెచ్‌ఒ ఎస్.భాస్కరరావు తెలిపారు.

వెంటనే ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన ఒక మహిళ మరణించడం బాధాకరమని, పొరుగు రాష్ట్రమైన తెలంగాణలోనూ కోవిడ్ కేసులు పెరగడంతో పాటు ఒక మరణం కూడా రికార్డు అయినట్లు వార్తలు వస్తున్నాయని, వెంటనే కోవిడ్‌పై ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో కోవిడ్ విజృంభించకుండా, వైరస్ సోకిన వారికి వైద్యం అందించడానికి అవసరమైన చర్యలు చేపట్టడం ప్రభుత్వ బాధ్యతని తెలిపారు. నూతన సంవత్సరాది, సంక్రాంతి పండగ వస్తున్న నేపథ్యంలో ఇది విజృంభించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. కోవిడ్ రెండో దశ విజృంభణ సమయంలో ఏర్పడిన గందరగోళ పరిస్థితులు, తీవ్ర ప్రాణనష్టం తిరిగి ఎట్టి పరిస్థితుల్లో జరక్కుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు పారామెడికల్ సిబ్బందిని, అవసరమైన మందులను, ఐసియు, ఆక్సిజన్ బెడ్లను సమకూర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలను అప్రమత్తం చేసి కోవిడ్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాలని సూచించారు.

సిద్ధమైన ప్రాంగణం

అంతా సిద్ధం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభకు కాకినాడ ముస్తాబు
- నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ

లోపలి పేజీలో..

ఖేల్‌రత్న, అర్జున అవార్డులు వెనక్కి

- ప్రధానికి వినేశ్ పోగాట్ లేఖ

న్యూఢిల్లీ: లైంగిక ఆరోపణలకు గురైన బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషన్ వీర విధేయులతో నిండిన రెజ్లింగ్ ఫెడరేషన్ పాలకవర్గాన్ని సస్పెండ్ చేసి ప్రజలను మభ్య పుచ్చాలని చూసిన కేంద్ర ప్రభుత్వ యత్నాలకు వినేశ్ పోగాట్ గట్టి షాక్ ఇచ్చారు. మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డు, అర్జున్ అవార్డును ప్రధాన మంత్రికి తిరిగి ఇచ్చేస్తున్నట్లు ఆమె మంగళవారం నాడు ప్రకటించారు. స్వలింగ సంపర్కం గురించి మాట్లాడినప్పటికీ బ్రిజ్‌భూషణ్‌ను సమర్థించిన ప్రధాని నరేంద్ర మోడీని తీవ్రంగా విమర్శిస్తూ బహిరంగ లేఖ రాసిన తరువాత ఆమె ఈ ప్రకటన చేశారు. ఒలింపిక్ పతకం సాధించిన సాక్షి మాలిక్ కుస్తీని వదులుకోవాల్సిన పరిస్థితిని కల్పించడం దారుణమని ఆమె ఆ లేఖలో పేర్కొనారు. మహిళా అథ్లెట్లు అంటే అంత అలుసా? బ్రిజ్‌భూషణ్ మీడియాతో అన్న మాటలు వినడానికి మోడీ అయిదు నిమిషాలు కేటాయించాలని ఆమె కోరారు. ప్రతి సందర్భంలోను అథ్లెట్లను ఆయన అవమానపరిచాడు. న్యాయం కోసం మహిళా రెజ్లర్లు వీధుల్లో పోరాడినప్పుడు ప్రభుత్వం కనీసం స్పందించలేదు. పతకాలు ప్రాణం కన్నా విలువైనవి. పతకం సాధించినప్పుడు గర్వంగా ఉందని చెప్పిన వారే, న్యాయం కోసం గళం విప్పినప్పుడు మమ్మల్ని దేశద్రోహులుగా చిత్రించారు. ఆ ద్రోహులెవరో మోడీ చెప్పాలి అని ఆమె అన్నారు. ఈ పరిస్థితుల్లో ఖేల్ రత్న, అర్జున్ అవార్డులు జీవితంలో అర్థం లేనివి. అహంకారంతో జీవించే మీ మార్గానికి అడ్డంకి కాకూడదన్న ఉద్దేశంతో ఈ అవార్డులను ప్రియమైన ప్రధానికి తిరిగి ఇస్తున్నానని పేర్కొన్నారు. చివరిలో మీ దేశపు కూతురు వినేష్ అని ఆమె పేర్కొన్నారు.

నెల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

సమ్మెలోకి మున్సిపల్ కార్మికులు

- పనిముట్లతో ర్యాలీలు
- ఎక్కడికక్కడ నిరసనలు

ప్రజాశక్తి- యంత్రాంగం

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు మంగళవారం నుంచి సమ్మె బాట పట్టారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యాన విధుల బహిష్కరించి వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీల ముందు ధర్నా చేశారు. పలు జిల్లాల్లో పనిముట్లతో ర్యాలీలు నిర్వహించారు. 'పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, గత ఎన్నికలకు ముందు జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు. వీరి పోరాటానికి సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో విశాఖ నగరంలో కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. అనకాపల్లిలోని జివిఎంసి జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. నర్సీపట్నంలో ర్యాలీ చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు పాల్గొని మద్దతు తెలిపారు. ధర్నా చౌక్ ధర్నాలో వారు మాట్లాడుతూ ఆయా రంగాల్లోని ఉద్యోగ, కార్మికులకు ఇచ్చిన హామీలను సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయకపోవడంతో లక్షలాదిమంది రోడ్డు మీదకు రావాల్సి వస్తోందన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పాల్గొని మద్దతు తెలిపారు. తిరువూరు, జగ్గయ్యపేట, నందిగామలో కార్మికులు విధులు బహిష్కరించారు. కృష్ణా జిల్లాలో మచిలీపట్నం, ఉయ్యూరు, గుడివాడల్లో మున్సిపల్ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. నంద్యాల జిల్లా నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు, కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు, గూడూరులో ధర్నా చేశారు. కోనసీమ జిల్లా మండపేట, రామచంద్రపురం, అమలాపురం, తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, నిడదవోలు, కాకినాడ జిల్లా సామర్లకోట, పిఠాపురం, పెద్దాపురం, తుని మున్సిపల్ కార్యాలయాలు, గొల్లప్రోలు, ఏలేశ్వరం నగర పంచాయతీ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. వైఎస్ఆర్ జిల్లాలో జమ్మలమడుగు, మైదుకూరు, ప్రొద్దుటూరు, అన్నమయ్య జిల్లాలో అన్నమయ్య, రాయచోటి, రైల్వేకోడూరు, బి.కొత్తకోట సమ్మెలో పాల్గొన్నారు. అనంతపురంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద బైటాయించారు. తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం నిరసన తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, మడకశిర, హిందూపురం మున్సిపల్ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించారు. విజయనగరం నగర పాలక సంస్థ, జిల్లాలోని బొబ్బిలి మున్సిపాలిటీ, నెల్లిమర్ల, రాజాం నగర పంచాయతీల్లో, పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపాలిటీల్లో కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆమదాలవలస, ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీల్లో విధులు బహిష్కరించారు. తిరుపతి కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. మున్సిపల్ కమిషనర్ హరితకు వినతిపత్రం మిగతా 2లో

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- సిఎంకు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు వినతి

టిటిడి కార్మికులకు ఇళ్ల స్థలాలు

- కల్యాణకట్ట క్షురకులకు రూ.20 వేలు
- ధర్మకర్తల మండలిలో తీర్మానం

లోపలి పేజీలో..

సత్యసాయి జిల్లా హిందూపురం మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న వలంటీర్లు

వలంటీర్ల తిరుగుబావుటా

- 'ఆడుదాం ఆంధ్ర' బహిష్కరణ
- రూ.18 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్
- 28 నుంచి నిరవధిక సమ్మె

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వంపై వలంటీర్లు తిరుగుబావుటా ఎగురవేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని, తమను పొరుగు సేవల ఉద్యోగులుగా గుర్తించాలని, రూ.18 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నుంచి రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఆందోళన బాట పట్టారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని బహిష్కరించారు. సమస్యపై ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 28 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. తమ సర్వీసును క్రమబద్ధీకరణ చేయాలని, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది మాదిరి తమనూ ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేర్చడంలో తాము కీలకపాత్ర పోషిస్తున్నామన్నారు. కరోనా విపత్కర సమయంలో సైతం తాము ప్రాణాలను ఫణంగా పెట్టి ముందుండి ప్రజలకు సేవలు అందించామని తెలిపారు. ఇన్ని సేవలు చేస్తోన్న తమను ప్రభుత్వం పట్టించుకోకపోవడం మిగతా 2లో

నేటి నుంచి సర్వేయర్లకు శిక్షణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూముల రీ సర్వే జరుగుతున్న 2,200 గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామ సర్వేయర్లకు, డిప్యూటీ సర్వేయర్లకు అనకాపల్లిలోని ఎపిఎస్‌టిఎ (సర్వే అకాడమీలో) ఆన్‌లైన్‌లో సబ్ డివిజన్, ఆఫ్‌లైన్ (భూ సరిహద్దులు నిర్ధారించడం)లో మెలకువల గురించి శిక్షణ ఇవ్వనున్నట్లు సర్వే సెటిల్‌మెంట్, ల్యాండ్ రికార్డ్సు కమిషనరు సిద్ధార్థజైన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ శిక్షణ ఈ నెల 27 నుంచి 30 వరకు ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఉంటుందన్నారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు సర్వే అకాడమీ ఆన్‌లైన్ ఎగ్జామ్ నిర్వహిస్తుందని తెలిపారు. రోజుకు కొన్ని గ్రామాల సర్వేయర్ల చొప్పున శిక్షణ ఉంటుందన్నారు.

లక్ష్మణ్ హత్య కేసులో సమగ్ర దర్యాప్తు

- ఎస్‌సి కమిషన్ ఛైర్మన్‌కు కెవిపిఎస్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం చాగల్లు మండలం చంద్రవరం గ్రామానికి చెందిన దళిత యువకుడు జొన్నకూటి లక్ష్మణ్‌ను హత్యచేసి కొవ్వూరు మండలం వాడపల్లి శివారు పంట పొలాల్లో పడేశారని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి అన్నారు. ఈ మేరకు ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్‌ను కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. హత్య జరిగిన ప్రదేశాన్ని సందర్శించాలని, హత్యపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. సమగ్ర విచారణ జరిపి రిపోర్టు పంపాలని తూర్పుగోదావరి ఎస్‌పికి ఆదేశాలు జారీ చేయాలన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు

- టిఎస్ చేతన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని గ్రామ, వార్డు సచివాలయశాఖ డైరెక్టరు టిఎస్ చేతన్ తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మంగళవారం విజయవాడలోని గ్రామ, వార్డు సచివాలయశాఖ ప్రధాన కార్యాలయంలో ప్రభుత్వ సంక్షేమ కేలండరుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనవరిలోపు అమలు కానున్న వివిధ పథకాల అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. వలంటీర్ల సన్మాన కార్యక్రమం, సంక్షేమ పథకాల అమలు, ఇబిసి నేస్తం, జగనన్న బీమా వంటి పథకాల అమలు తీరుపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టెక్నికల్ అంశాలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఆ శాఖ అడిషనల్ డైరెక్టరు భావన, వివిధ విభాగాల ఉన్నత స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

7, 10 తరగతుల విద్యార్థులకు ఇఇఎమ్‌టి 2024 మెరిట్ లిస్ట్

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

ఎడ్యుకేషనల్ 'ఎపిఫని' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇఇఎమ్‌టి (ఎడ్యుకేషనల్ ఎపిఫని మెరిట్ లిస్ట్) 2024 పరీక్షల షెడ్యూల్, రిజిస్ట్రేషన్ లింక్, క్యూఆర్ కోడ్‌ను పాఠశాల విద్యాశాఖ కమిషనరు సురేష్‌కుమార్ విడుదల చేశారు. మంగళవారం సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయంలో 'ఎడ్యుకేషనల్ ఎపిఫని' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు తవనం వెంకటరావు, ఉపాధ్యక్షులు హేమచంద్ర.. కమిషనరుతో భేటీ అయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో 7, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు డిసెంబరు 27 నుంచి జనవరి 8 వరకు http//educationalepophany.org/eemt2024/regostration.php. లింక్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు. డిసెంబరు నెలాఖరు వరకు ఉన్న సిలబస్ నుంచి 80 శాతం ప్రశ్నలు ఉంటాయని, మిగిలిన 20 శాతం జనరల్ నాలెడ్జ్, ఆప్టిట్యూడ్ ఉంటాయని, జనవరి 23న ప్రిలిమనరీ, జనవరి 31న మెయిన్స్, ఆన్‌లైన్‌లో 'కోడ్ తంత్ర' సాఫ్ట్‌వేర్ పరీక్షలు ఉంటాయని తెలిపారు.

సమ్మెలోకి మున్సిపల్ కార్మికులు

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చారు. సూళ్లూరుపేట మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పుత్తూరు మున్సిపాల్టీలో విధులు బహిష్కరించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ధర్నా చేశారు. తాడేపల్లిగూడెం, ఏలూరులో చీపుర్లు, పారలతో ర్యాలీ నిర్వహించారు. తణుకు, ఆకివీడు, నూజివీడులో విధులు బహిష్కరించారు. ప్రకాశం జిల్లా ఒంగోలు, జిల్లా కేంద్రమైన బాపట్ల, జిల్లాలోని అద్దంకి, చీరాలలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. నెల్లూరులో చీపుర్లు, పనిముట్లతో ర్యాలీ నిర్వహించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం ముందు తాడేపల్లి పట్టణం, రూరల్, రాజధాని ప్రాంత మున్సిపల్ కార్మికులు సమ్మె శిబిరం నిర్వహించారు. వీరికి కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మద్దతు తెలిపి ప్రసంగించారు. మున్సిపల్ కార్మికులు గొంతెమ్మ కోరికలు కోరడంలేదన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేట, సత్తెనపల్లి, మాచర్ల, పిడుగురాళ్లలో కార్మికులు విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో కంచాలను మోగిస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

అనకాపల్లి జిల్లా చోడవరంలో అంగన్‌వాడీలను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

కనీస వేతనంతోనే గౌరవం

రాష్ట్రవ్యాప్తంగా నిరసన శిబిరాల్లో ముక్తకంఠంతో నినదించిన అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - యంత్రాంగం

గౌరవ వేతనం మాకొద్దు.. కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మె శిబిరాల వద్ద కంచాలను మోగిస్తూ అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న వారి సమ్మె మంగళవారం నాటికి 15వ రోజుకు చేరుకుంది.

శ్రీకాకుళం జిల్లా పొందూరులో సమ్మెకు సంఘీభావం తెలిపిన గర్భిణులు, బాలింతలు తమ చిన్నారులతో కలిసి గరిటెలతో పళ్లాలు మోగించారు. విజయనగరం జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లా అంతటా ఖాళీ ప్లేట్లు మోగిస్తూ నిరసన తెలిపారు. విజయనగరంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు పి.రఘువర్మ, వి.చిరంజీవి మద్దతు తెలిపారు. నెల్లూరు ఐసిడిఎస్ పిడి కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతపురం జిల్లా పరిధిలోని పుట్లూరులో వేప ఆకులు తింటూ నిరసన తెలిపారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద భిక్షాటన చేశారు. బాపట్లలో నల్ల బెలూన్లతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉమ్మడి కడప, ఒంగోలులో ప్లేట్లు మోగిస్తూ నిరసన తెలిపారు.

తూర్పుగోదావరి జిల్లాలో అంగన్‌వాడీలకు మద్దతుగా ఆశా వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోచమ్మ ఆధ్వర్యంలో చాగల్లు తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కర్నూలు ధర్నాచౌక్‌లో పొర్లు దండాలతో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాలు ఎదుట ప్లేట్లను మోగిస్తూ నిరసన తెలిపారు.

విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. గాజువాక నియోజకవర్గంలోని మిందిలో ఉంటున్న మంత్రి అమర్‌నాథ్‌ను అంగన్‌వాడీ కార్యకర్తలు కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. అనకాపల్లి జిల్లా పరవాడలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ప్రారంభానికి పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ వచ్చిన సందర్భంగా అంగన్‌వాడీలు దీక్షా శిబిరం నుంచి అక్కడకు వెళ్లి నిరసన తెలిపారు. ఆయనకు వినతిపత్రం అందజేశారు. అల్లూరి జిల్లాలోని అన్ని మండలాల్లో కంచాలు మోగిస్తూ నిరసన తెలిపారు. చింతూరు వద్ద శబరి నదిలో దిగి వినూత్నంగా నిరసన తెలియజేశారు.

ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ ధర్నా చౌక్‌లో ప్లేట్లు మోగించి నిరసన తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ పట్టణ పౌర సమాఖ్య కన్వీనర్ సిహెచ్. బాబూరావు, యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ, ఇతర నేతలు మద్దతు తెలిపి మాట్లాడారు. సమ్మెను అణిచి వేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందని, ఇటువంటి చర్యను తిప్పికొట్టాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మద్దతు తెలిపారు.

పశ్చిమగోదావరి జిల్లాలో కంచాలను గరిటెలతో కొడుతూ నిరసన తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి సంఘీభావం తెలిపారు. ఏలూరు జిల్లా భీమడోలులో ఒంటికాలిపై నిలబడి గరిటెలతో కంచాలను మోగిస్తూ నిరసన తెలిపారు.గుంటూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా తెలిపారు. పల్నాడు జిల్లా యడ్లపాడులో పిఆర్ విజ్ఞాన కేంద్రం నుండి జాతీయ రహదారి వరకూ ఖాళీ కంచాలు మోగిస్తూ ప్రదర్శన చేశారు. అమరావతిలో అంబేద్కర్ విగ్రహం ఎదుట మానవహారంగా ఏర్పడి కంచాలు మోగించారు.

మీరు టెస్ట్‌రాసి రాలేదు
అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వ విప్ ధర్మశ్రీ వ్యాఖ్యలు

అనకాపల్లి జిల్లా చోడవరం తహశీల్దారు కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు... అటువైపు వెళుతున్న ప్రభుత్వ విప్, చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీని అడ్డగించారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు కదిలేది లేదని బీష్మించారు. దీంతో కారు దిగి శిబిరం వద్దకు వచ్చిన ధర్మశ్రీ మాట్లాడుతూ 'ప్రభుత్వ ఉద్యోగులు మాదిరిగా మీకు సదుపాయాలు కల్పించడానికి మీరు టెస్ట్ రాసి వచ్చిన వారు కాదు. గౌరవ వేతనానికి నియమింపబడ్డ కార్యకర్తలు. ఆ విధంగానే మిమ్మల్ని ప్రభుత్వం పరిగణిస్తుంది. తక్షణమే దీక్ష విరమించి విధుల్లోకి హాజరుకండి. లేకుంటే మిమ్మల్ని ప్రభుత్వం విధులు నుంచి తప్పిస్తుంది' అని హెచ్చరించారు. ఆయన వ్యాఖ్యలను వ్యతిరేకించిన అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. దీంతో ఆయన అక్కడ నుండి వెనుదిరిగారు.

మంత్రి జయరాం ఇంటి ముట్టడి

కర్నూలు జిల్లాలో ఆలూరులో కార్మికశాఖ, ఉపాధిశాఖమంత్రి గుమ్మనూరు జయరాం ఇంటిని అంగన్‌వాడీలు ముట్టడించారు. అనంతరం మంత్రికి వినతిపత్రం అందజేశారు. మీ సమస్యలను సిఎం దృష్టికి తీసుకువెళ్తామని మంత్రి హామీ ఇచ్చారు. మంగళగిరిలో లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి వచ్చిన మంత్రి రోజాను కలవాలని అంగన్‌వాడీలు వెళ్లగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు వినడానికి కూడా మంత్రి నోచుకోకపోవడాన్ని నిరసించారు.

సిఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- సిఎంకు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు వినతి

ప్రజాశక్తి-గుంటూరు

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. గుంటూరు వచ్చిన సిఎంను లక్ష్మణరావు కలిసి వినతిపత్రాలు అందచేశారు. గత 15 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నారని, వేతనాలు పెంపు, గ్రాట్యుటీ అమలుపై తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. 2018 తర్వాత డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల కాకపోవడంతో దాదాపు నాలుగు లక్షల మంది నిరుద్యోగులు నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారని, డిఎస్‌సి నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వం చేపట్టిన కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియలో పాలిటెక్నిక్ కాంట్రాక్ట్ అధ్యాపకులందరూ రెగ్యులర్ అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 309 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు పనిచేస్తున్నారని, అయితే ఇటీవల ఎపిపిఎస్‌సి పోస్టుల భర్తీ, నాన్ టీచింగ్ స్టాఫ్ ప్రమోషన్లు వంటి కారణాల వల్ల కాంట్రాక్ట్ అధ్యాపకులందరూ రెగ్యులర్ అయ్యే పరిస్థితి లేదని చెప్పారు. ఈ దృష్ట్యా కొత్తగా పోస్టులు మంజూరు చేసి, అందర్నీ రెగ్యులర్ అయ్యేలా చూడాలని కోరారు. గ్రూప్-1, 2 ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో అభ్యర్థుల వయోపరిమితి 42 ఏళ్లుగా నిర్ణయించిందని, అయితే నోటిఫికేషన్లు రెగ్యులర్‌గా లేకపోవటం వల్ల కొంతమంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయారని, వారిని దృష్టిలో ఉంచుకొని 44 ఏళ్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

స్టీల్ ప్లాంట్ ప్రధాన రహదారిపై బైఠాయించిన కార్మిక సంఘాల నేతలు

స్మార్ట్ మీటర్లతో రూ.20 వేల కోట్లు దోపిడీ!

- కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

స్మార్ట్ మీటర్ల పేరుతో అదానీకి దోచిపెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోందని, రూ.20 వేల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని, ఈ డబ్బుతో అంగన్‌వాడీలు, ఇతర ఉద్యోగుల సమస్యలను పరిష్కరించవచ్చునని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. నెల్లూరులోని సిపిఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలకు ఏలాంటి ప్రయోజనమూ లేదన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని అనుమతించొద్దని, దానిని ప్రతిఘటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ కంపెనీలకు రూ.20 వేల కోట్లు దోచిపెట్టడం మానేస్తే అంగన్‌వాడీలు, ఆశాలు, మున్సిపల్ వర్కర్లు, సర్వశిక్ష అభియాన్, ఇతర కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయవచ్చని చెప్పారు. రాష్ట్రంలోని 1.32 కోట్ల మంది విద్యుత్ వినియోగదారులను ఇబ్బందులు పెట్టి, తొలుత స్మార్ట్ మీటర్ రూ.ఆరు వేలు, తరువాత రూ.ఎనిమిది వేలు, మళ్లీ రూ.14 వేలు ఇప్పుడు రూ.32 వేలు చేశారన్నారు. ఇప్పటికే విద్యుత్ బిల్లులతో ప్రజలు సతమతమవుతున్నారని, ప్రతి నెలా రూ.200 నుంచి రూ.300 కోట్లు ఛార్జీల పేరుతో అదనంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. డబ్బులు లేవని ప్రభుత్వం కథలు చెబుతోందని, ఉన్న డబ్బులు ఎక్కడకు వెళుతున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ప్రజాధనం దోచిపెట్టడం తప్ప, రోజు కష్టపడి పనిచేసే ఉద్యోగుల భవిష్యత్తును పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వలంటీర్లు సమ్మెలోకి వస్తున్నారని, అందరూ జగన్‌మోహన్‌రెడ్డిపై ఆగ్రహంతో వీధుల్లోకి వస్తుంటే, ఇప్పటికీ కళ్లు తెరవడం లేదన్నారు. బేషజాలకు పోకుండా అంగన్‌వాడీలతో సహా అందరితో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బైజూస్ దివాలా తీసిందని, ఇలాంటి కంపెనీకి ప్రభుత్వం డబ్బులు దోచిపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, కార్యదర్శివర్గ సభ్యులు ఎం. మోహన్‌రావు, కె.అజయ్‌కుమార్, మూలి వెంగయ్య పాల్గొన్నారు.

కరెంటుపై జిఎస్‌టి

- కేంద్రం ఆదేశాలతో 'డెలాయిట్' అధ్యయనం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కరెంటు స్విచ్ వేస్తే 'జిఎస్‌టి' షాక్ కొట్టడం ఖాయంగా కనిపిస్తుంది. నిత్యవసర వస్తువుల్లో విద్యుత్ కూడా చేరడంతో పన్ను ఎందుకు వేయకూడదో అధ్యయనం చేసి చెప్పండంటూ 'డెలాయిట్ ఆడిట్ అండ్ కన్సల్టెంట్స్' సంస్థను కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ ఆదేశించింది. ఇటీవలే తన నివేదికను కేంద్రానికి సమర్పించింది. దేశంలోని రాష్ట్రాలన్నీ వేర్వేరుగా ఎలక్ట్రిసిటీ డ్యూటీ (ఇడి) వసూలు చేస్తున్నాయనీ, ఇది కొన్ని రాష్ట్రాల్లో ఎక్కువగా, మరికొన్ని రాష్ట్రాల్లో తక్కువగా ఉన్నదని గుర్తించారు. రాష్ట్రాల మధ్య 'ఇడి' పన్ను ఒక శాతం నుంచి ఐదు శాతం వరకు ఉన్నదనీ, జిఎస్‌టి పరిధిలోకి తెస్తే 0.5 శాతం నుంచి ఒక్క శాతానికి పరిమితం చేయవచ్చని ప్రతిపాదించారు. కరెంటు వినియోగదారుల్ని జిఎస్‌టి పరిధిలోకి తెస్తే దాని ప్రభావం ఆయా రాష్ట్రాల ఆదాయం, పరిశ్రమలు, గృహ వినియోగదారులపై ఎలా ఉంటుందనే విషయాలను కూడా అధ్యయనం చేసింది. త్వరలోనే కేంద్రప్రభుత్వం దీన్ని అమల్లోకి తెచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి

- స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే దారులన్నీ దిగ్బంధం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కును ప్రయివేటుపరం చేయాలన్న కుట్రతో జిందాల్‌తో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని, నూతన వేతనాలు అమలు చేయాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన కార్మికులు స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్‌ను మంగళవారం ముట్టడించారు. స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే రహదారులన్నింటినీ దిగ్బంధించారు. అధికారుల నుంచి ఈ పోరాటానికి విశేష మద్దతు లభించింది. ముట్టడి కార్యక్రమానుద్దేశించి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ, కో - కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడారు. దొడ్డిదారిన స్టీల్‌ప్లాంటును ప్రయివేటు వ్యక్తులకు అప్పగించేందుకు చేస్తోన్న ప్రయత్నాలను తిప్పికొడతామన్నారు. బ్లాస్ట్ ఫర్నేస్-3ను రెండేళ్ల పాటు జిందాల్‌కు కేటాయించేందుకు ఒప్పందం చేసుకున్నారని, దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదని తెలిపారు. ఆ ఒప్పందాన్ని రద్దు చేసుకోకుంటే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బిఎఫ్-3ని జిందాల్‌కు అప్పగిస్తున్న ప్రభుత్వం, యాజమాన్యం అతి త్వరలోనే మరికొన్ని విభాగాలను ప్రయివేట్‌కు అప్పగించే ప్రమాదముందన్నారు. నాణ్యమైన విశాఖ ఉక్కు ఉత్పత్తులకు ఉన్న బ్రాండ్ ఇమేజ్‌ని దెబ్బతీసే ఒప్పందాలను కార్మికులు అంగీకరించబోరని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కరెంట్ బిల్లు చెల్లించకపోతే కరెంట్ ఆపుతాం అంటూ హెచ్చరించడం దారుణమన్నారు. ఇప్పటికే అదానీ గంగవరం పోర్టు బకాయిలు చెల్లించకపోతే మెటీరియల్ రవాణా చేయనంటోందని, రేపు జిందాల్ మెటీరియల్ సరఫరాను ఆపేస్తే ప్లాంట్ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రూ.మూడు లక్షల కోట్ల విలువైన స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రలోని మోడీ ప్రభుత్వం ప్రయివేటుపరం చేస్తామంటుంటే రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేనలు నోరుమెదపకపోవడం దారుణమన్నారు. ఈ ముట్టడి కార్యక్రమంలో అన్ని డిపార్టుమెంట్లకు చెందిన కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యశస్వికి పాస్‌పోర్టు ఇచ్చేయండి

హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

తెనాలికి చెందిన ఎన్‌ఆర్‌ఐ బొద్దులూరి యశస్వికి హైకోర్టులో వెసులుబాటు లభించింది. యశస్వి నుంచి స్వాధీనం చేసుకున్న పాస్‌పోర్టును వెంటనే అప్పగించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు మంగళగిరి సిఐడి ఎస్‌పి, తిరుపతి సిఐడి ప్రాంతీయ కార్యాలయం ఇన్‌స్పెక్టర్లకు జస్టిస్ భానుమతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, సిఎం జగన్ పట్ల అపకీర్తి కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టిన కారణంగా అమెరికా నుంచి వచ్చిన యశస్విని ఎపి సిఐడి పోలీసులు హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. ప్రజా హితంతోనే ప్రభుత్వ లోపాలను పిటిషనర్ ఎత్తిచూపారని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాదని ఆమె తరపున న్యాయవాదులు వాదించారు. వీసా రెన్యువల్ కోసం ఈ నెల 26న కాన్సులేట్ వద్ద పిటిషనర్ హాజరుకావాల్సి ఉందని, పాస్ట్‌పోర్టు ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేలా పిటిషనర్ పోస్టింగ్స్ పెట్టారని సిఐడి ప్రత్యేక పిపి శివకల్పనారెడ్డి వాదించారు. అదుపులోకి తీసుకున్నాక 41ఏ నోటీసు ఇచ్చి వదిలిపెట్టినట్లు వివరించారు. ఆ నోటీసుకు విరుద్ధంగా మీడియాతో మాట్లాడారని చెప్పారు.

బహిరంగ తిరుగుబాటుకు ప్రజలు సిద్ధం

- యనమల రామకృష్ణుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి, దోపిడీ, మితిమీరిన అహంకారంతో విసుగు చెందిన ప్రజలు బహిరంగ తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారని టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్ అసమర్ధపాలనపై సొంత పార్టీ ఎంపి రఘురామ కృష్ణరాజు బయటపెట్టారని, అనంతరం ఎమ్మెల్యేలు తిరుగుబాటు బావుటా ఎగురవేశారని పేర్కొన్నారు. అభ్యర్థుల మార్పు నిర్ణయాలతో ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు సైతం ధిక్కార స్వరం వినిపిస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వ అరాచకాలు, ధరల బాదుడు, పన్నుల మోత, ఇసుక, మద్యం వంటి అంశాలపై నిశ్శబ్దంగా ఉన్న సామాన్యులు గేరు మార్చి స్వరం విప్పుతున్నారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు నిరసనగా అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశా వర్కర్లు, మున్సిపల్ ఉద్యోగులు రోడ్డెక్కి సమర శంఖం పూరించారని అన్నారు.

మోసపోయిన ఎమ్మెల్యేలు : నక్కా ఆనంద్‌బాబు

సిఎం జగన్ అడ్డగోలు నిర్ణయాలతో నమ్మిన ఎమ్మెల్యేలు మోసపోయారని, ఉన్నవారైనా జాగ్రత్త పడాలని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు పేర్కొన్నారు. మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జగన్ నమ్మక ద్రోహానికి హద్దులుండవన్నారు. తన సొంత ప్రయోజనాల కోసం ఎంతటి వారినైనా బలిగొనడం ఆయన పని అని, జగన్ చెప్పేదొకటి, చేసేది మరొకటి అని అన్నారు.

భూ యాజమాన్య హక్కు చట్టంలోని నిబంధనలపై పిల్

ప్రజాశక్తి-అమరావతి

ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కు చట్టం (ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్-2022)లోని కొన్ని నిబంధనలను సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. పలు సెక్షన్లను రద్దు చేయాలని కోరుతూ కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంవి చక్రపాణి దాఖలు చేసిన పిల్‌లో ప్రతివాదులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శిని చేర్చారు. 'భూ యాజమాన్య హక్కు చట్టం భారతీయ వారసత్వ చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా ఉంది. 21, 246, 300ఏ అధికరణాలకు విరుద్ధం. రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులను కాలరాసేలా భూ యాజమాన్య చట్టంలోని 10, 13, 14, 15, 25, 34, 46 సెక్షన్లు ఉన్నాయి' అని పిల్‌లో పేర్కొన్నారు.

బుజ్జగింపులు... బెదిరింపులు

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఒకవేళ వారు విధుల్లోకి రాకపోతే ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు

రేపటి నుండి ఎమ్మెల్యేల ఇళ్లు ముట్టడి
బేబీరాణి, కె.సుబ్బరావమ్మ,

సమ్మె చేపట్టి 15వ రోజులు గడుస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదని, చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారని, ఇప్పటి వరకూ నాలుగుసార్లు చర్చలు జరిపినా అన్నిసార్లు బుజ్జగింపులు, బెదిరింపులేననిఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బేబిరాణి, కె.సుబ్బరావమ్మ తెలిపారు. . డిమాండు పరిష్కారం అయ్యే వరకూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. బుధవారం ఎమ్మెల్యేలు, మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని, జనవరి 3వ తేదీన కలెక్టరేట్లను దిగ్బంధిస్తామని తెలిపారు. చర్చల్లో తమ ప్రధాన డిమాండ్లయిన గ్రాట్యుటీ, వేతనాల పెంపు గురించి మాట్లాడటం లేదని, తొలి సమావేశంలో ఏవైతే అంశాలు చెప్పారో అదే అంశాలను మరలా చెప్పారని, ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని పేర్కొన్నారు. అదేమంటే వాటి గురించి సిఎంకు చెప్పలేదని అంటున్నారని, వీళ్లు చెప్పకపోయినా సిఎంకు తెలియదా అని వారు ప్రశ్నించారు

ఎన్నిసార్లు చర్చలు జరిపినా జీతాలు పెంచరంట: జి.భారతి

15 రోజుల నుండి సమ్మె చేస్తుంటే సిఎం దగ్గరకు విషయాన్ని తీసుకెళ్లలేదని మంత్రి చెబుతున్నారని, పైగా పండుగ తరువాత చర్చిస్తామని, అప్పుడు కూడా జీతాలు పెంచబోమని చెబుతున్నారని, ఐఎఫ్‌టియు ఉపాధ్యక్షులు జి.భారతి తెలిపారు. జీతం పెంచే ప్రసక్తే లేదని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వర్కర్లంటే ప్రభుత్వానికి చిన్నచూపు ఉందని అన్నారు. ప్రభుత్వం పరిష్కరిస్తామని చెబుతున్న అంశాల్లో చాలా లోపభూయిష్టంగా ఉన్నాయని తెలిపారు. ఇచ్చిన హామీని నెరవేర్చమని కోరితే అంగన్‌వాడీ వర్కర్లను నడిరోడ్డుపై ఉంచారన్నారు. కలిసొచ్చే అన్ని సంఘాలు, రాజకీయ పార్టీలను కలుపుకుని సమ్మెను ఉధృతం చేస్తామని, సంఘీభావ కార్యక్రమాలు నిర్వహిస్తామని అంగన్‌వాడీ సంఘాల తరుపున ప్రకటించారు.

కనీస బకాయిలు ఇవ్వమంటున్నారు : జి.లలిత

అంగన్‌వాడీలతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె.లలిత అన్నారు. విషయాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్లలేదంటున్నారని, ఇదేమీ అన్యాయమని ప్రశ్నించారు. గ్రాట్యుటీపై కేంద్రంతో తేల్చుకోమంటున్నారని చెప్పారు. సెంటర్లకు రావాల్సిన బకాయిలు ఇవ్వడం లేదని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువ పనిచేస్తున్నావేతనం పెంచడానికి ఇష్టపడటం లేదని అన్నారు. ఇప్పటి వరకూ సరుకులు నెలాఖరుకు ఇస్తున్నారని, సమ్మెలో ఉన్నామని చెప్పి ఒకటోతేదీనే సరఫరా చేయాలని చెబుతున్నారని, ఇంతకంటే అన్యాయం మరొకటి లేదని అన్నారు.

ప్రభుత్వానిది బాధ్యతా రాహిత్యం
సిహెచ్ నరసింగరావు

అంగన్‌వాడీలతో చర్చల విషసయంలో ప్రభుత్వానిది పూర్తి బాధ్యతా రాహిత్యమని, చర్చలు పరిష్కరించే దిశగా కాకుండా బెదరించే ధోరణితో మంత్రి, అధికారులు వ్యవహరించారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. నాలుగుసార్లు చర్చలు జరిపినా కొత్త విషయం ఒకటీ మాట్లాడలేదని, పైగా సిఎంకు తెలియదని చెప్పడం మరీ విడ్డూరమని అన్నారు. ఇన్ని రోజులు సమ్మె జరుగుతుంటే సిఎం దృష్టిలో లేదని చెప్పడం సరైంది కాదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇదే తీరుతో వ్యవహరిస్తే అంగన్‌వాడీలు ఎన్నిరోజులైనా సమ్మెను కొనసాగిస్తారని తెలిపారు. మహిళల పట్ల ప్రభుత్వ తీరు దుర్మార్గమని పేర్కొన్నారు. వారి ఆందోళనకు సిఐటియు సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. ఎఐటియుసి, ఐఎఫ్‌టియు సంఘాలతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా కార్మికవర్గాన్ని సమీకరించి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా తప్పుడు వైఖరి విడనాడాలని కోరారు.

వలంటీర్ల తిరుగుబావుటా

(మొదటిపేజీ తరువాయి)

విచారకరమన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని వలంటీర్లు బహిష్కరించారు. పట్టణంలోని ఎంజిఎం మైదానం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ ఛాంబర్ ముందు బైఠాయించారు. హిందూపురం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. వైసిపి నాయకులు బెదిరింపులకు పాల్పడినా భయపడకుండా ఆందోళన కొనసాగించారు. విజయనగరం జిల్లా భోగాపురం మండల కేంద్రంలో 35 మంది, పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలంలో 35 పంచాయతీలకు చెందిన 314 మంది వలంటీర్లు సమ్మెలోకి వెళ్లారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని బహిష్కరించారు. పని భారం తగ్గించాలని, పనికితగ్గ వేతనం చెల్లించాలని కోరుతూ ఏలూరు జిల్లా ముదినేపల్లి సచివాలయ పరిధిలోని 32 మంది వలంటీర్లు ఎంపిడిఒ పి.మల్లేశ్వరిని కలిసి వినతిపత్రం అందజేశారు. సచివాలయ సిబ్బంది చేయాల్సిన విధులను కూడా తమతో చేయిస్తుండడం సరికాదని తెలిపారు. త్వరలో సమ్మెలోకి వెళ్లనున్నామని ఈ వినతిపత్రంలో పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి మండలం శకునాలపల్లి సచివాలయ పరిధిలోని వలంటీర్లు సమ్మె నోటీసును పంచాయతీ కార్యదర్శి కరిముల్లాకు అందజేశారు.

ఓటర్ల జాబితా తుదిముద్రణ గడువు పెంపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఓటర్ల జాబితా తుది ముద్రణ గడువును పెంచుతూ ఎన్నికల సంఘం మంగళవారం ఆదేశాలు జారీచేసింది. ఇప్పటి వరకూ జనవరి 5వ తేదీన తుదిముద్రణ చివరతేదీగా ప్రకటించారు. ఇంకా మార్పులు చేర్పులు, పరిశీలనలు పూర్తి చేయాల్సి ఉండగా జనవరి 22న తుది ముద్రణ చివరితేదీగా ప్రకటించారు. ఈ మేరకు ఎన్నికల సంఘం కార్యదర్శి రాజేష్‌కుమార్ సింగ్ ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, బీహార్, కేరళ, ఉత్తరాఖండ్, హర్యానా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, పంజాబ్, ఢిల్లీ రాష్ట్రాలకు ఆదేశాలు జారీచేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి- మహానంది

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన నంద్యాల జిల్లా మహానంది మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సీతారామపురం గ్రామానికి చెందిన రైతు తాళ్లూరి జగన్ శ్రీనివాసులు (55) మూడెకరాల సొంతపొలంతో పాటు రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేశారు. ఇందు నిమిత్తం బ్యాంకులో రూ.ఐదు, ప్రయివేటు వ్యక్తుల వద్ద రూ. నాలుగు లక్షలు అప్పు చేశారు. తెగుళ్లు సోకడంతో సరైన దిగుబడి రాలేదు. చేసిన అప్పులు తీరేమార్గం లేక ఇంట్లోనే క్రిమిసంహార మందు తాగారు. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయనకు భార్య సావిత్రి, కుమార్తె సాయి చందు, కుమారుడు జితేంద్ర ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గృహ నిర్మాణ సంస్థ ఇడిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు (ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్)గా గ్రూప్-1 అధికారి బి చంద్రశేఖర్ మంగళవారం ఆటోనగర్‌లోని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్లు సి జయరామాచారి, నాగభూషణం, వెంకటరెడ్డి, చీఫ్ మేనేజరు ఎన్ అన్నపూర్ణ, జనరల్ మేనేజరు (ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్) శ్రీరాములు పాల్గొన్నారు.

ఎస్‌సి ఉప ప్రణాళికపై నిర్లక్ష్యం

- 26 శాఖల్లో 50 శాతంకన్నా తక్కువ వ్యయం
- అయినా అదనపు నిధుల కోసం ప్రతిపాదన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వేల కోట్లు అందుబాటులో ఉన్నా ఖర్చు చేయలేని అధికారులు అదనపు నిధులకోసం ప్రతిపాదనలు పంపించడం చర్చనీయాంశంగా మారింది. సాంఘిక సంక్షేమ శాఖలో ఎస్‌సి ఉప ప్రణాళిక కింద భారీగా అందిన ప్రతిపాదనలు ఈ చర్చకు కారణమయ్యాయి, రూ.550 కోట్ల వరకు ఉప ప్రణాళికలో వివిధ శాఖల ద్వారా ఖర్చు చేసేందుకు నిధులు కావాలని ఆ శాఖ అధికారులు ఆర్థికశాఖకు లేఖ రాశారు. అయితే, 2023-24 ఆర్థిక సంవత్సరంలో అనేక శాఖల ద్వారా ఎస్‌సిల అభివృద్ధి కోసంరూ. 21,344 కోట్లు కేటాయించారు. ఇందులో తొలి ఐదు నెలల్లో కేవలం 9,202 కోట్లే వ్యయం జరిగింది. అనేక ఇతర శాఖల పరిస్థితి కూడా ఇంతే. 26 శాఖల్లో అయితే 50 శాతంలోపే నిధులు ఖర్చు చేశారు. తొమ్మిది శాఖల్లో 26 నుంచి 50 శాతం వరకు ఖర్చు చేయగా, ఎనిమిది శాఖల్లో 25 శాతం వరకు మాత్రమే ఖర్చు జరిగింది. అయితే మరో 9 శాఖల్లో ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదని తేలింది.

బడ్జెట్ లేకనే

రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎస్సీ ఉప ప్రణాళిక కింద కొంతవరకు నిధులు వస్తున్న ప్పటికీ తమకు కేంద్రం నుంచి నిధులు రాలే దని, అందుకే తాము ఏమీ ఖర్చు చేయలేక పోయామని పరిశ్రమలు, పంచాయితీరాజ్ వంటి శాఖల అధికారులు వివరించారు. కొన్ని శాఖల నుంచి ఉప ప్రణాళిక నిధుల ఖర్చు కోసం కార్యాచరణ ప్రణాళికే రాలేదని తెలుస్తోంది. మరి కొన్ని శాఖలు తమ శాఖల ద్వారా చేసే వ్యయానికి సంబంధించిన ఆర్థిక గణాంకాలు సమర్పించలేదు.

రేపు గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈ నెల 28న కలెక్టరేట్ల వద్ద గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా చేయనున్నట్లు ఎపి పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు, అధ్యక్షులు డి వెంకట్రామయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో పంచాయతీ, స్వచ్ఛ భారత్, క్లాప్ మిత్ర కార్మికులకు 15 నెలలుగా వేతనాలు రాక అవస్థలు పడుతున్నారని, వెంటనే వేతన బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారికి కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. 28న ధర్నాను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

కర్నూలు కలెక్టరేట్ ఎదుట భిక్షాటన చేస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులనుద్దేశించిమాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్, కాకినాడలో భిక్షాటన చేస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

భిక్షాటనతో ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరసన

- ఏడవ రోజు కొనసాగిన నిరవధిక సమ్మె

ప్రజాశక్తి-యంత్రాంగం

సమస్యల పరిష్కారం కోరుతూ సమగ్ర సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతోంది. భిక్షాటన చేస్తూ, కంచాలు మోగిస్తూ, చెవిలో పువ్వులు పెట్టుకొని, మానవహారం, ర్యాలీలతో నిరసన తెలిపారు. మంగళవారానికి ఏడో రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో పలు జిల్లాల్లోని వక్తలు మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాలు గడిచిన విద్యాశాఖలో పనిచేసే సమగ్ర శిక్ష ఉద్యోగులను పట్టించుకోకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు విద్యా కార్యక్రమాలు నిర్వహించడంలో ఎస్ఎస్ఎ ఉద్యోగులు కీలక పాత్ర వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కష్టజీవుల సమస్యలను పట్టించుకోవడం లేదని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎస్ఎస్ఎ ఉద్యోగులు ధైర్యంగా, ఐక్యంగా పోరాడాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించకుండా కార్మికుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి సమ్మె విరమింప చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టరేట్ల వద్ద సమగ్ర సర్వశిక్ష కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సమగ్ర శిక్ష ఉద్యోగుల కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి కాంతారావు మద్దతు తెలిపారు. జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షలు నిర్వహించారు. ఖాళీ కంచాలను మోగిస్తూ నినాదాలు చేశారు. భిక్షాటన చేపట్టారు. అనకాపల్లిలో ర్యాలీ మానవహారం నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. సత్యసాయి జిల్లా కేంద్రంలో పుట్టపర్తిలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఇంటి వద్ద ధర్నా చేశారు. వీరి ఆందోళనకు పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నేతలు మద్దతు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం డిఇఒ కార్యాలయం ఎదుట నిర్వహించిన శిబిరంలో ఖాళీ కంచాలు మోగిస్తూ నిరసన తెలిపారు. కాకినాడ జిల్లా కాకినాడ డిఇఒ కార్యాలయం వద్ద, కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో డిఇఒ కార్యాలయం వద్ద భిక్షాటన చేశారు. తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం, చిత్తూరు కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరాలు కొనసాగాయి. శ్రీకాకుళంలో చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట, పల్నాడు జిల్లా నరసరావుపేట ధర్నా చౌక్‌లో సమ్మె శిబిరాలు కొనసాగాయి. కర్నూలులో భిక్షాటన చేశారు. నంద్యాలలో ధర్నా చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని కలెక్టరేట్ మార్గంలో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని యుటిఎఫ్ నేతలు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఏలూరులో భిక్షాటన చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. నెల్లూరు కలెక్టరేట్ ఎదుట జోలెపట్టి భిక్షాటన చేస్తూ, అర్ధనగ్న ప్రదర్శన, డప్పులు, పాటలతో నిరసన తెలిపారు. ఉమ్మడి కడప జిల్లాలో సమ్మె కొనసాగింది. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడలో నిరసనలు కొనసాగుతున్నాయి. బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద సమ్మె చేస్తున్న సర్వశిక్ష ఉద్యోగులకు యుటిఎఫ్ నాయకులు సంఘీభావం తెలిపారు.

మ్యూచువల్ ఫండ్స్‌లో రెట్టింపు వృద్ధి

- రూ.50 లక్షల కోట్లకు ఎయుఎం
- రేటింగ్ ఏజెన్సీ ఇక్రా వెల్లడి

ముంబయి : ప్రస్తుత ఏడాది 2023లో మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల్లో 125 శాతం వృద్ధి చోటు చేసుకోనుందని రేటింగ్ ఎజెన్సీ ఇక్రా అంచనా వేసింది. నవంబర్‌లో ఎంఎఫ్‌ల్లోకి రూ.25,616 కోట్లు వచ్చాయని.. ఈ ఏడాది జనవరిలో రూ.11,373 కోట్ల పెట్టుబడులు నమోదయ్యాయి. ఈ రంగంలో పెట్టుబడులకు చాలా మంది ఇన్వెస్టర్లు ఆసక్తి చూపుతున్నారని ఇక్రా అనలిటిక్స్ మార్కెట్ డాటా హెడ్ అశ్విన్ కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయంగా చమురు ధరల్లో స్థిరత్వం, వడ్డీ రేట్లలో మార్పులు ఎంఎఫ్‌ల్లో పెట్టుబడులకు మద్దతును ఇస్తున్నాయన్నారు.

2023 నవంబర్ 30 నాటికి ఎంఎఫ్ పరిశ్రమ అసెట్ అండర్ మేనేజ్‌మెంట్ (ఎయుఎం) రూ.49.05 లక్షల కోట్లకు చేరింది. 2023 జనవరి 31 నాటికి ఇది రూ.39.62 లక్షల కోట్లుగా ఉంది. డిసెంబర్ ముగింపు నాటికి రూ.50 లక్షల కోట్ల మైలురాయికి చేరనుందని అంచనా. వచ్చే కొన్నేళ్లలో రూ.100 లక్షల కోట్లకు చేర్చాలని ఎంఎఫ్ పరిశ్రమ వర్గాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.

సిస్టమెటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్ (సిప్)ల్లో ప్రతీ నెల రూ.250 నుంచి పెట్టుబడులు పెట్టుకోవడానికి ఇటీవల సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) అనుమతులిచ్చింది. నవంబర్ ముగింపు నాటికి సిప్‌ల్లో 7.44 కోట్ల ఖాతాలు నమోదయ్యాయి. అక్టోబర్‌లో ఈ ఖాతాదారుల సంఖ్య 7.30 కోట్లుగా ఉంది. గడిచిన నవంబర్ ముగింపు నాటికి సిప్‌ల ఎయుఎం రూ.9.31 లక్షల కోట్లకు చేరింది. 2023 అక్టోబర్ ముగింపు నాటికి 8.60 లక్షల కోట్ల ఎయుఎం నమోదయ్యింది.

24 ఉప రంగాలపై డిపిఐఐటి దృష్టి

- ఎగుమతుల పెంపు లక్ష్యం

న్యూఢిల్లీ : దేశీయంగా తయారీని ప్రోత్సహించడానికి.. దిగుమతులను తగ్గించుకోవడానికి.. ఎగుమతులను పెంచుకోవడానికి 24 ఉప రంగాలపై దృష్టి కేంద్రీకరించినట్లు డిపిఐఐటి తెలిపింది. వీటిలో ఫర్నీచర్, అల్యూమినియం, అగ్రోకెమికల్స్, టెక్స్‌టైల్స్, ఎయిర్ కండీషనర్లు, తోలు, పాదరక్షలు తదితర ఉప రంగాలున్నాయని డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డిపిఐఐటి) ఓ ప్రకటనలో తెలిపింది. మేక్ ఇన్ ఇండియా ప్రారంభించినప్పటి నుండి పలు ముఖ్యమైన విజయాలు సాధించామని.. ఇప్పుడు 'మేక్ ఇన్ ఇండియా 2.0' కింద 27 రంగాలపై దృష్టి సారిస్తోన్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలోనే డిపిఐఐటి 15 తయారీ రంగాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలను సమన్వయం చేస్తుండగా, వాణిజ్య శాఖ 12 సేవా రంగాలకు సమన్వయం చేస్తోందని వెల్లడించింది. పోటీతత్వం, దిగుమతి ప్రత్యామ్నాయం అవసరం, ఎగుమతి సామర్థ్యం పెంపు, ఉపాధిని దృష్టిలో ఉంచుకుని ఎంచుకున్న 24 ఉపరంగాలతో కలిసి పని చేయనున్నట్లు తెలిపింది. ఇథనాల్, సిరామిక్స్, సెట్ టాప్ బాక్సులు, రోబోటిక్స్, టెలివిజన్లు, క్లోజ్ సర్క్యూట్ కెమెరాలు, బొమ్మలు, డ్రోన్లు, వైద్య పరికరాలు, క్రీడా వస్తువులు, జిమ్ పరికరాలు తదితర విభాగాలపై కూడా దృష్టి సారించినట్లు పేర్కొంది. ఆయా ఉప రంగాల్లో పెట్టుబడులను సులభతరం చేయనున్నట్లు డిపిఐఐటి వెల్లడించింది.

ఐటి ఇ-ధ్రువీకరణ స్కీంపై సెమినార్

హైదరాబాద్ : ఆదాయపు పన్ను ఇ-ధృవీకరణ స్కీంపై చర్చాగోష్టి కార్యక్రమం జరిగింది. మంగళవారం హైదరాబాద్‌లోని ఎఫ్‌టిసిసిఐ కార్యాలయంలో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎఐ)తో కలిసిన నిర్వహించిన ఈ సమావేశానికి ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇన్‌కం టాక్స్ సునీతా బైన్స్లా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 200 పైగా సిఎలు, పన్ను చెల్లింపుదారులు హాజరైన ఈ సమావేశంలో సునీతా మాట్లాడుతూ.. ఇ-వెరిఫికేషన్ నిబంధనలు పాటించని కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని పేర్కొన్నారు. స్వచ్ఛంద పన్ను సమ్మతిని ప్రోత్సహించడానికి, పారదర్శకతతో కూడిన పన్ను పరిపాలనను సులభతరం చేయడానికి ఇ-ధవీకరణ పథకం 2021ని కేంద్రం నోటిఫై చేసిందని ఆమె గుర్తు చేశారు. హైదరాబాద్‌లోనూ ఇ-ధవీకరణ పథకం పెండింగ్‌లో ఉన్న కేసులు పెద్ద సంఖ్యలో ఉండటం చాలా ఆందోళన కలిగించే అంశమన్నారు. ప్రజలు డిపార్ట్‌మెంట్‌కు కట్టుబడి, సహకరించాలని ఆమె కోరారు. ఆస్తులు, అప్పులకు సరైన మూల్యాంకనాన్ని చూపాలనే లక్ష్యంతో ఇ-ధృవీకరణ పథకం ప్రవేశపెట్టామన్నారు. ఎఫ్‌టిసిసిఐ ప్రెసిడెంట్ మీలా జయదేవ్ మాట్లాడుతూ.. ఇ-వెరిఫికేషన్ స్కీమ్ పన్ను చెల్లింపుదారుల నుండి మరింత సమాచారాన్ని సేకరించడానికి, ఇతర నిర్దిష్ట ఏజెన్సీల నుండి అందుకున్న స వ ా చా ం ం తో పోల్చుకోవడానికి ప్రభుత్వం పన్ను కార్యాలయానికి అధికారం ఇస్తోందన్నారు.

గ్రీన్ ఎనర్జీలో అదాని రూ.9,350 కోట్ల పెట్టుబడులు

ముంబయి : అదానీ గ్రీన్ ఎనర్జీ (ఎజిఎల్)లో అదాని గ్రూపు రూ.9,350 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఇందుకోసం డిసెంబర్ 26న ప్రమోటర్లకు ఒక్కో షేరు ధర రూ.1,480.75 చొప్పున రూ.9,350 కోట్ల విలువ చేసే ప్రిఫరెన్షియల్ వారెంట్ల జారీకి ఎజిఎల్ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. ఈ నిధులను డెలివరేజింగ్, వేగవంతమైన మూలధన వ్యయం కోసం ఉపయోగించబడతాయని పేర్కొంది. 2030 నాటికి 45 గిగావాట్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రకటనతో మంగళవారం బిఎస్ఇలో అదాని గ్రీన్ ఎనర్జీ షేర్ 5 శాతం పెరిగి రూ.1,617 వద్ద ముగిసింది.

మార్కెట్లకు మూడో రోజూ లాభాలు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడు సెషన్లలో లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ దేశీయ సూచీల్లో కొనుగోళ్ల మద్దతుతో మంగళవారం సెన్సెక్స్, నిఫ్టీలు రాణించాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 230 పాయింట్లు పెరిగి 71,337 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 92 పాయింట్లు పెరిగి 21,441కు చేరింది. బిఎస్ఇలో దాదాపు 2,063 స్టాక్స్ లాభపడగా.. 1,325 షేర్లు నష్టాలను చవి చూడగా.. 109 షేర్లు యథాతథంగా నమోదయ్యాయి.

బంధన్ ఎంఎఫ్ కొత్త క్యాంపెయిన్

హైదరాబాద్ : బంధన్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా 'బడ్తె రహు' ట్యాగ్‌లైన్‌తో క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. ఎంఎఫ్‌ల్లో పెట్టుబడులను ప్రోత్సహించేలా దీన్ని రూపొందించింది. భవిష్యత్తు కోసం తమ సంపదను నిర్మించుకోవడంలో చాలా శ్రద్ధ చూపే వ్యక్తులు భవిష్యత్తు గురించి చింతించకుండా ఆర్థిక భద్రత వీలు కల్పించాలన్నదే తమ ఉద్దేశ్యమని బంధన్ ఎఎంసి సిఇఒ విశాల్ కపూర్ పేర్కొన్నారు.

మద్యపాన నిషేధమంటూ మోసం

గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మద్యపాన నిషేధమంటూ రాష్ట్ర ప్రజలను వైసిపి ప్రభుత్వం మోసం చేసిందని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ధీర్ఘకాలం పనిచేసిన తహశీల్దారు స్థాయి వ్యక్తి వైసిపి ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిని తెలియజేశారని అన్నారు. ల్యాండ్, శ్యాండ్, లిక్కర్‌తో కోట్లాది రూపాయలు ముడుపులు వైసిపి పెద్దలకు అందుతున్నాయని ఆరోపించారు. డిజిటల్ మనీ అంటూ చేప్పే ప్రధాని మోడీకి ఆంధ్రప్రదేశ్‌లో జరిగే మోసాలు కనపడటం లేదా అని ప్రశ్నించారు. తహశీల్దారు స్థాయి వ్యక్తి చెప్పినవన్నీ నిజాలే అని అన్నారు.

నేడు ఢిల్లీలో సమావేశం

రానున్న ఎన్నికల్లో దృష్టిలో ఉంచుకుని ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాహులు గాంధీ, కెసి వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్యరావు ఠాకూర్ ఆధ్వర్యంలో బుధవారం సమన్వయ కమిటీ సమావేశం జరగనుందని రుద్రరాజు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 30 మంది ముఖ్యులతో జరిగే ఈ సమావేశంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంతోపాటు ఎన్నికల్లో ఏ విధంగా ముందుకు వెళ్లాలనే దానిపై ప్రధానంగా చర్చించనున్నట్లు వివరించారు.

టిటిడి కార్మికులకు ఇళ్ల స్థలాలు

- కల్యాణకట్ట క్షురకులకు రూ.20 వేలు
- ధర్మకర్తల మండలిలో తీర్మానం

ప్రజాశక్తి - తిరుమల

ధర్మకర్తల మండలి నిర్ణయాలను వెల్లడిస్తున్న టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి

టిటిడి కార్మికులకు తొలి విడతగా 3518 మందికి గురువారం ఇళ్ల స్థలాలను పంపిణీ చేయాలని ధర్మకర్తల మండలిలో తీర్మానం చేశారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన ధర్మకర్తల మండలి సమావేశం మంగళవారం ఉదయం జరిగింది. అందులో తీసుకున్న నిర్ణయాలను టిటిడి చైర్మన్ మీడియాకు వివరించారు. ఆయన వివరాల మేరకు.. మరో వారం పది రోజుల్లో మరో 1500 మందికి ఇంటి స్థలాలు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వానికి రూ.80 కోట్లు చెల్లించి మరో 350 ఎకరాల భూమి సేకరించి ఫిబ్రవరిలోపు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడానికి బోర్డు తీర్మానం చేసిందని తెలిపారు. తిరుమల కల్యాణకట్టలో పీస్‌రేట్ లెక్కన పనిచేస్తున్న క్షురకులకు నెలకు రూ.20 వేలు కనీస వేతనం అందించాలని, ఈ నిర్ణయం వల్ల దాదాపు 250 కుటుంబాలకు మేలు జరగనుందన్నారు. శాశ్వత ఉద్యోగులు కాని పోటు కార్మికులకు రూ.10వేలు వేతనం పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని, దాదాపు 350 కుటుంబాలకు లబ్ది చేకూరనుందని చెప్పారు. వాహన బేరర్లు, ఉగ్రాణం కార్మికులను స్కిల్డ్ లేబర్‌గా గుర్తించి జీతాలు పెంచేలా నిర్ణయం, టిటిడిలోని వివిధ విభాగాల్లో మిగిలిన కాంట్రాక్టు కార్మికుల జీతాలు కనీసం రూ.మూడు వేలు పెంచేలా నిర్ణయం తీసుకున్నారు. పెద్దజీయర్, చిన్నజీయర్ మఠాల నిర్వహణ, అక్కడి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడానికి పెద్దజీయర్ మఠానికి ఏటా రూ.60 లక్షలు, చిన్న జీయర్ మఠానికి ఏటా రూ.40 లక్షల అదనపు ఆర్థిక సాయం చేయాలని బోర్డులో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ముత్తూట్ హోమ్‌ఫిన్ (ఇండియా) లిమిటెడ్

Muthoot Homefin

కార్పోరేట్ కార్యాలయం: యూనిట్ నం.19-ఎన్ఇ, 19వ అంతస్తు, ది రూబీ, సేనాపతి బాపత్ మార్గ్, రూపారెల్ కాలేజీ వద్ద, దాదర్ (పశ్చిమం), ముంబై, మహారాష్ట్ర-400 028.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3(1)తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13 (2) క్రింద.

ఏదైతే దిగువ సంతకందారుడు ముత్తూట్ హోమ్‌ఫిన్ (ఇండియా) లిమిటెడ్ (ఎంహెచ్ఐఎల్) అధీకృత అధికారి సెక్యూరిటీజైషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సదరు యాక్ట్) మరియు సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13 (2) క్రింద, డిమాండ్ నోటీసు జారీ చేస్తూ సెక్షన్ 13(2) క్రింద రుణగ్రహీత/లు ("సదరు రుణగ్రహీత"), దిగువన సూచిస్తూ, దిగువ ఇవ్వబడిన వివరాల ప్రకారం, సంబంధిత డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించమని పేర్కొనడం జరిగింది.

పై దానిని అనుసరించి, ఇందుమూలంగా ఇవ్వబడిన నోటీసు ప్రకారం, మరొకసారి, రుణగ్రహీతలను కోరడమేమనగా ఈ నోటీసు ప్రచురించిన తేది నుండి 60రోజులలోగా ఎంహెచ్ఐఎల్‌కు మొత్తాన్ని చెల్లించమని కోరడమైనది, పేర్కొన్న సంబంధిత తేదిల నుండి డిమాండ్ నోటీసులో వివరించిన సంవత్సరానికి 2% తదుపరి వడ్డీతో కలుపుకొని, లోను ఒప్పందం మరియు ఇతర డాక్యుమెంట్లు/రాతపూర్వకాలు చదువుకోవలెను, ఏదైన సదరు రుణగ్రహీతల చేత అమలైతే, లోను తిరిగిచెల్లించే బాకీ కొరకు సంబంధిత రుణగ్రహీతలు ఎంహెచ్ఐఎల్ లిమిటెడ్‌కు తాకట్టుపెట్టిన సెక్యూరిటీగా ఉన్న దిగువ సెక్యూరీటీ ఆస్తులు దిగువన ఇవ్వడమైనది.

క్ర. సం	రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు)/ హామీదారు పేరు/లోను ఖాతా నం./శాఖ	మొత్తం బకాయిలు (రూ.)	డిమాండ్ నోటీసు తేది	సెక్యూర్డ్ అస్సెట్ (స్థిరాస్తి) వివరణ
1.	నిమ్మగడ్డ సునీత/ పృథ్వీ కటం (1వ సహ దరఖాస్తుదారు)/ 050-05000028/విజయవాడ	రూ.28,92,643/- (ఇరవై ఎనిమిది లక్షల తొంబై రెండు వేల ఆరు వందల నలభై మూడు రూపాయలు మాత్రమే)	21-Dec-2023	రెసిడెన్షియల్ ఫ్లాట్ నం.జిఎఫ్-1, గ్రౌండ్ ఫ్లోర్, శ్రీ సాయి రెసిడెన్సీ ఎన్ఆర్ హౌ.నం.12-37, ఆర్ఎస్ నం.87/2 ఎనమలకుదురు గ్రామం ఎన్ఎడి జి.పి. పెనమలూరు మండలం కృష్ణాజిల్లా, ఎ.పి.-520007

ఎంహెచ్ఐఎల్ కు రుణగ్రహీతలు తిరిగిచెల్లించలేక విఫలం చెందినట్లయితే, ఎంహెచ్ఐఎల్ వారు పై సెక్యూర్డ్ ఆస్తులు తదుపరి చర్యలు చేపట్టుతారు. సదరు చట్టం సెక్షన్ 13(4) క్రింద సంబంధిత రుణగ్రహీతలు ఖర్చులు మరియు పర్యవసనాలకు మొత్తం బాధ్యత వహించగలరు.

సదరు రుణగ్రహీతలు ఎంహెచ్ఐఎల్ వారిని సంప్రదించకుండా పైన వివరించిన ఆసులను అమ్మకంగాని, లీజు లేదా ఇతరత్రములకు బదిలీచేయుట నిషేదించడమైనది. ఎవరైన వ్యక్తి చట్టం లేదా నియమాలను ఉల్లంఘించేనట్లయితే అదే అలాచేయుటకు ప్రేరేపించన్లయితే వారికి చట్టం క్రింద చట్టబద్ధంగా జైలు శిక్ష/లేదా జరిమానా విధింపబడుతుంది.

తేది: 27 డిసెంబర్, 2023
ప్రదేశం: కృష్ణ

సం/- అధీకృత అధికారి
ముత్తూట్ హోమ్‌ఫిన్ (ఇండియా) లిమిటెడ్

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్

మీ కుటుంబ బ్యాంక్, భారతదేశం అంతటా

Celebrating 100 Years of Trust 1924

అసెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచి, 1వ ఫ్లోర్, ప్లాట్ నెం.50, శ్రీనగర్ కాలనీ, రోడ్డు నెం.3, బంజారాహిల్స్, హైదరాబాద్-500073.

ఫోన్ : 040-23755686/23745686
ఇ-మెయిల్ : hyd.arm@ktkbank.com
వెబ్‌సైట్ : www.karnatakabank.com
CIN : L85110KA1924PLC001128

స్థిరాస్తుల యొక్క అమ్మకపు ప్రకటన

స్థిరాస్తులు అమ్మకానికి 2002 నాటి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు లోని నిబంధన 8(6) అంశాలతో చదువుకొనేలా 2002 నాటి సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం క్రింద ఇవ్వబడిన ఇ-వేలం అమ్మకం ప్రకటన, రుణదాతకు మార్టిగేజి చేసిన / చార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక స్వాధీనం చేసుకోబడిందని, సదరు ఆస్తులను రుణదాతచే "ఎక్కడ ఉన్నది అక్కడే" "ఉన్నది ఉన్నట్లే" మరియు "యదాతథం" ప్రాతిపదికపై 05.02.2024 తేదీన విక్రయించబడునని దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలు / హామీదారులు / సహపూచీదారుల నుండి బకాయిపడిన మొత్తాన్ని వసూలు చేయుటకై సదరు ఆస్తులు విక్రయించబడుచున్నవనీ సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రస్తుడు(లు) మరియు గ్యారంటీదారుడు(లు)లకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు బ్రాంచి, ఫోన్: 0863-2222444 (G), 9985202444 (BM), 9676444469 (ABM)

వ.నెం.1: ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారుల యొక్క పేర్లు & చిరునామా, సింబాలిక్ స్వాధీనత యొక్క తేదీ మరియు సెక్యూర్డ్ ఆస్తుల యొక్క వివరములు: ఋణగ్రహీతలు/హామీదారులు/సహపూచీదారులు: (1) మెస్సర్స్ శ్రీ లక్ష్మి కామాక్షి కాటన్ ట్రేడర్స్ తరపున యజమాని: శ్రీ చిన గురవయ్య పోకూరు, C/o. విజయకార్తికేయ జిన్నింగ్ మిల్, జగదాంబ ఎస్టేట్, మహాలక్ష్మిపురం, ఏటుకూరు రోడ్డు, గుంటూరు-522003. (2) శ్రీ చిన గురవయ్య పోకూరు, తండ్రి: శ్రీ చెంచయ్య, (3) శ్రీమతి కామేశ్వరి పోకూరు, భర్త: శ్రీ పోకూరు చిన గురవయ్య, నెం.2 & 3 చిరునామా: డి.నెం.9-11-168, నిశ్శంకర వారి వీధి, కొత్తపేట, గుంటూరు-522001. నెం.2 ప్రత్యామ్నాయ చిరునామా: ముస్తఫాపురం, తేళ్ళపాడు, ఆత్మకూరు మండలం, నెల్లూరు జిల్లా-524301. నిర్మాణాత్మక స్వాధీనత తేది: 29.01.2020. బకాయి మొత్తం: PS OVER DRAFT A/C 2557000600473001 క్రింద బకాయిపడిన మొత్తం అగు రూ.16,12,620.68/- (అక్షరాల పదహారు లక్షల పన్నెండు వేల ఆరు వందల ఇరవై రూపాయలు మరియు అరవై ఎనిమిది పైసలు మాత్రమే) + 01.08.2018 నుండి భవిష్య వడ్డీ మరియు ఖర్చులు మొ॥.

ఆస్తి యొక్క వివరము: గుంటూరు, ప్రస్తుతము న్యూ గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ లిమిట్స్, గోరంట్ల, డోర్ నెం. 256/ఎ, అర్జున్-2 నందు శ్రీమతి కామేశ్వరి పోకూరు 240 చ॥గ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీ ప్లాట్ నెం.262కు సంబంధించిన యావదాస్తి. సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం.261; తూర్పు: ప్లాట్ నెం.255; దక్షిణం: ప్లాట్ నెం.263; పడమర: 40 అ॥ వెడల్పుగల రోడ్డు.

రిజర్వుధర : రూ.8,00,000/- (అక్షరాల ఎనిమిది లక్షల రూపాయలు మాత్రమే)
చెల్లించవలసిన బయానా : రూ.80,000/- (అక్షరాల ఎనభై వేల రూపాయలు మాత్రమే)

వ.నెం.2: ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారుల యొక్క పేర్లు & చిరునామా, సింబాలిక్ స్వాధీనత యొక్క తేదీ మరియు సెక్యూర్డ్ ఆస్తుల యొక్క వివరములు: ఋణగ్రహీతలు/హామీదారులు/సహపూచీదారులు: (1) మెస్సర్స్ అంజలి సుచరిత కాటన్ ట్రేడర్స్ తరపున ప్రొప్రయిటర్: శ్రీమతి శశికళ కూనంనేని, చిరునామా: 63/3, C/o. శ్రీ రామ్ కాటన్ జిన్నింగ్ మిల్స్, యూనిట్ 1, ఏటుకూరు రోడ్డు, మహాలక్ష్మీపురం, గుంటూరు-522003. (2) శ్రీమతి శశికళ కూనంనేని, భర్త: శ్రీ శ్రీనివాస హరి ప్రసాదరావు కూనంనేని, (3) శ్రీ వెంకట సుబ్బారావు గోగినేని, తండ్రి: శ్రీ లక్ష్మీనారాయణ, చిరునామా: నెం.3-8, హైస్కూల్ రోడ్డు, పెదరావూరు, గుంటూరు-522002. (4) శ్రీ శ్రీనివాస హరిప్రసాద్‌రావు కూనంనేని, తండ్రి: శ్రీ పుల్లయ్య, నెం.(2) & (4) చిరునామా: డి.నెం.13-15-37, రామాలయం వీధి, పినపాడు, తెనాలి, గుంటూరు-522002. నిర్మాణాత్మక స్వాధీనత తేది: 08.07.2022 మరియు 27.09.2022. బకాయి మొత్తం: PSOD A/c No. 2557000600475501 క్రింద రూ.1,70,58,826.49 (అక్షరాల ఒక కోటి డెబ్భై లక్షల యాభై ఎనిమిది వేల ఎనిమిది వందల ఇరవై ఆరు రూపాయలు మరియు నలభై తొమ్మిది పైసలు మాత్రమే) 01-08-2021 తేదీనుండి భవిష్యవడ్డీ + వ్యయాలు మొ॥.

ఆస్తుల యొక్క వివరములు:

ఐటమ్ నెం.1): గుంటూరు జిల్లా, తెనాలి మునిసిపాలిటీ, పోతురాజు టెంపుల్ మరియు చెరువు దగ్గర, పినపాడు ఎక్స్‌టెన్షన్, 16వ బ్లాక్, 1వ వార్డు, టి.యస్.నెం.574/2, డోర్ నెం.13-17-6 నందు శ్రీమతి శశికళ కూనంనేని కి చెందిన 152 చ॥గ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. దస్తావేజులు ప్రకారము / వాస్తవముగా వున్న సరిహద్దులు: తూర్పు: 20' వెడల్పుగల జాయింట్ బజారు / 20' వెడల్పుగల జాయింట్ బజారు; దక్షిణం: సిహెచ్.వెంకటరత్నం యొక్క ఆస్తి / సిహెచ్. వెంకటరత్నం యొక్క ఆస్తి; పడమర: యస్‌కె.బుడే సాహెబ్ యొక్క ఆస్తి / యస్‌కె.బుడే సాహెబ్ యొక్క ఆస్తి; ఉత్తరం: పి.వెంకట ఆదినారాయణ మరియు ఇతరుల యొక్క ఆస్తి / పి.వెంకట ఆదినారాయణ మరియు ఇతరుల యొక్క ఆస్తి. అక్షాంశము: 16.231100'N; రేఖాంశము: 80.6345689'E.

రిజర్వుధర : రూ.12,00,000/- (అక్షరాల పన్నెండు లక్షల రూపాయలు మాత్రమే)
చెల్లించవలసిన బయానా : రూ.1,20,000/- (అక్షరాల ఒక లక్ష ఇరవై వేల రూపాయలు మాత్రమే)

ఐటమ్ నెం.2): గుంటూరు జిల్లా, తెనాలి మునిసిపాలిటీ, పోతురాజు టెంపుల్ మరియు చెరువు దగ్గర, పినపాడు ఎక్స్‌టెన్షన్, 16వ బ్లాక్, 1వ వార్డు, టి.యస్.నెం.574/2, సమీప డోర్ నెం.13-17-6 నందు శ్రీమతి శశికళ కూనంనేని కి చెందిన 153.77 చ॥గ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. దస్తావేజులు ప్రకారము / వాస్తవముగా వున్న సరిహద్దులు: తూర్పు: 20' వెడల్పుగల జాయింట్ బజారు / స్పష్టంగా విర్వచిలేదు; దక్షిణం: కె.సీతారావమ్మ యొక్క ఆస్తి / కె.సీతారావమ్మ యొక్క ఆస్తి; పడమర: షేక్ బుడే సాహెబ్ మరియు ఇతరుల యొక్క ఆస్తి / షేక్ బుడే సాహెబ్ మరియు ఇతరుల యొక్క ఆస్తి; ఉత్తరం: అమ్మకందారుని యొక్క ఆస్తి / అమ్మకందారుని యొక్క ఆస్తి. అక్షాంశము: 16.2304017'N; రేఖాంశము: 806354156'E.

రిజర్వుధర : రూ.12,00,000/- (అక్షరాల పన్నెండు లక్షల రూపాయలు మాత్రమే)
చెల్లించవలసిన బయానా : రూ.1,20,000/- (అక్షరాల ఒక లక్ష ఇరవై వేల రూపాయలు మాత్రమే)

ఐటమ్ నెం.3): గుంటూరు జిల్లా, తెనాలి మునిసిపాలిటీ, పోతురాజు టెంపుల్ మరియు చెరువు దగ్గర, పినపాడు ఎక్స్‌టెన్షన్, 16వ బ్లాక్, 1వ వార్డు, టి.యస్.నెం.574/2, సమీప డోర్ నెం.13-17-6 నందు శ్రీమతి శశికళ కూనంనేని కి చెందిన 300 చ॥గ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. దస్తావేజులు ప్రకారము / వాస్తవముగా వున్న సరిహద్దులు: తూర్పు: యస్.సత్యనారాయణకి చెందిన ఆస్తి / యస్.సత్యనారాయణకి చెందిన ఆస్తి; దక్షిణం: చల్లా వెంకట సాంబి రెడ్డికి చెందిన ఆస్తి / చల్లా వెంకట సాంబి రెడ్డికి చెందిన ఆస్తి; పడమర: 20' వెడల్పుగల రోడ్డు / 20' వెడల్పుగల రోడ్డు; ఉత్తరం: వంగర కోటిలింగంకు చెందిన ఆస్తి / వంగర కోటిలింగంకు చెందిన ఆస్తి. అక్షాంశము: 16.2310442'N; రేఖాంశము: 80.6356808'E.

రిజర్వుధర : రూ.24,00,000/- (అక్షరాల ఇరవైనాలుగు లక్షల రూపాయలు మాత్రమే)
చెల్లించవలసిన బయానా : రూ.2,40,000/- (అక్షరాల రెండు లక్షల నలభై వేల రూపాయలు మాత్రమే)

ఐటమ్ నెం.4): గుంటూరు జిల్లా, తెనాలి మునిసిపాలిటీ, పోతురాజు టెంపుల్ మరియు చెరువు దగ్గర, పినపాడు ఎక్స్‌టెన్షన్, 16వ బ్లాక్, 1వ వార్డు, టి.యస్.నెం.574/2, సమీప డోర్ నెం.13-17-6 నందు శ్రీమతి శశికళ కూనంనేని కి చెందిన 300 చ॥గ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. దస్తావేజులు ప్రకారము / వాస్తవముగా వున్న సరిహద్దులు: తూర్పు: ఉమ్మడి బజారు / స్పష్టంగా విర్వచిలేదు; దక్షిణం: పంటకాలువ / పంటకాలువ; పడమర: యస్‌కె.బుడే సాహెబ్ & ఇతరులకు చెందిన ఆస్తి / యస్‌కె.బుడే సాహెబ్ & ఇతరులకు చెందిన ఆస్తి; ఉత్తరం: పి.వెంకట ఆదినారాయణ మరియు ఇతరుల యొక్క ఆస్తి / పి.వెంకట ఆదినారాయణ మరియు ఇతరుల యొక్క ఆస్తి. అక్షాంశము: 16.2310442'N; రేఖాంశము: 80.6356808'E.

రిజర్వుధర : రూ.24,00,000/- (అక్షరాల ఇరవైనాలుగు లక్షల రూపాయలు మాత్రమే)
చెల్లించవలసిన బయానా : రూ.2,40,000/- (అక్షరాల రెండు లక్షల నలభై వేల రూపాయలు మాత్రమే)

ఐటమ్ నెం.5): గుంటూరు జిల్లా, తెనాలి మండలం, అంగలకుదురు గ్రామము, డొంకరోడ్డు ఏరియా, హాస్టల్ బిల్డింగ్ దగ్గర, డోర్ నెం. 43/B1, 43/B2, 43/B3 నందు శ్రీ వెంకట సుబ్బారావు గోగినేని కి చెందిన 317 చ॥గ॥ విస్తీర్ణముగల ప్లాట్ నెం.65, 66, 67 రెసిడెన్షియల్ ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. దస్తావేజులు ప్రకారము / వాస్తవముగా వున్న సరిహద్దులు: ఎ) ప్లాట్ నెం.65 కు హద్దులు: తూర్పు: 30 అ॥ వెడల్పుగల రోడ్డు; దక్షిణం: ప్లాట్ నెం.64; పడమర: హద్దు లేదు; ఉత్తరం: రైల్వే వారి ఆస్తి. బి) ప్లాట్ నెం.66 & 67 కు హద్దులు: తూర్పు: బోడి కెనాల్; దక్షిణం: ప్లాట్ నెం.68; పడమర: 30' వెడల్పుగల రోడ్డు; ఉత్తరం: రైల్వే వారి ఆస్తి. అక్షాంశము: 16.2311847'N; రేఖాంశము: 80.644776'E.

రిజర్వుధర : రూ.29,00,000/- (అక్షరాల ఇరవై తొమ్మిది లక్షల రూపాయలు మాత్రమే)
చెల్లించవలసిన బయానా : రూ.2,90,000/- (అక్షరాల రెండు లక్షల తొంభై వేల రూపాయలు మాత్రమే)

ఐటమ్ నెం.6): గుంటూరు జిల్లా, తెనాలి మునిసిపాలిటీ, మారీస్‌పేట, రవివారి వీధి, 14వ బ్లాక్, 2వ వార్డు, టి.యస్.నెం.449/3 నందు శ్రీ శ్రీనివాస హరిప్రసాదరావు కూనంనేని కి చెందిన 106.55 చ॥గ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. దస్తావేజులు ప్రకారము / వాస్తవముగా వున్న సరిహద్దులు: తూర్పు: కె.వెంకటరెడ్డి యొక్క ఆస్తి / కె.వెంకటరెడ్డి యొక్క ఆస్తి; పడమర: సిహెచ్.హరిగోపాల్ యొక్క ఆస్తి / సిహెచ్.హరిగోపాల్ యొక్క ఆస్తి; ఉత్తరం: 12' వెడల్పుగల రోడ్డు / 12' వెడల్పుగల సిసి రోడ్డు మరియు దక్షిణం: యమ్.రాజేశ్వరి యొక్క ఆస్తి / యమ్.రాజేశ్వరి యొక్క ఆస్తి. అక్షాంశము: 16.2311847'N; రేఖాంశము: 80.6447767'E.

రిజర్వుధర : రూ.24,50,000/- (అక్షరాల ఇరవై నాలుగు లక్షల యాభై వేల మాత్రమే)
చెల్లించవలసిన బయానా : రూ.2,45,000/- (అక్షరాల రెండు లక్షల నలభై ఐదు వేల రూపాయలు మాత్రమే)

ఐటమ్ నెం.7): గుంటూరు జిల్లా, తెనాలి మండలం, డొంక రోడ్డు ఏరియా, జె.యమ్.జె. కాలేజ్ దగ్గర, అంగలకుదురు గ్రామము, డి.నెం.448/2 నందు శ్రీ శ్రీనివాస హరిప్రసాదరావు కూనంనేని కి చెందిన 220 చ॥గ॥ విస్తీర్ణముగల ప్లాట్ నెం.6 రెసిడెన్షియల్ ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. దస్తావేజులు ప్రకారము / వాస్తవముగా వున్న సరిహద్దులు: తూర్పు: కొడాలి సాంబశివరావుకు చెందిన ప్లాట్ నెం.5 ఆస్తి / కొడాలి సాంబశివరావుకు చెందిన ప్లాట్ నెం.5 ఆస్తి (ప్రస్తుతము ఖాళీస్థలము); దక్షిణం: 30' వెడల్పుగల రోడ్డు / 30' వెడల్పుగల రోడ్డు (స్పష్టంగా విర్వచిలేదు); పడమర: ప్లాట్ నెం.7 యొక్క ఆస్తి / ప్లాట్ నెం.7 యొక్క ఆస్తి (ప్రస్తుతము ఖాళీస్థలము); ఉత్తరం: చదలవాడ తిరుపతిరావు & ఇతరుల యొక్క ఆస్తి / చదలవాడ తిరుపతిరావు & ఇతరుల యొక్క ఆస్తి. అక్షాంశము: 16.228969'N; రేఖాంశము: 80.620995'E.

రిజర్వుధర : రూ.8,50,000/- (అక్షరాల ఎనిమిది లక్షల యాభై వేల రూపాయలు మాత్రమే)
చెల్లించవలసిన బయానా : రూ.85,000/- (అక్షరాల ఎనభై ఐదు వేల రూపాయలు మాత్రమే)

ఐటమ్ నెం.8): గుంటూరు జిల్లా, తెనాలి మండలం, డొంక రోడ్డు ఏరియా, జె.యమ్.జె. కాలేజ్ దగ్గర, అంగలకుదురు గ్రామము, డి.నెం.448/2, 43/బి2, 43/బి3 నందు శ్రీ శ్రీనివాస హరిప్రసాదరావు కూనంనేని కి చెందిన 238.33 చ॥గ॥ విస్తీర్ణముగల ప్లాట్ నెం.9 రెసిడెన్షియల్ ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. దస్తావేజులు ప్రకారము / వాస్తవముగా వున్న సరిహద్దులు: తూర్పు: దేవభక్తుని లక్ష్మీనరసమ్మ యొక్క ప్లాట్ నెం.8 ఆస్తి / దేవభక్తుని లక్ష్మీనరసమ్మ యొక్క ప్లాట్ నెం.8 ఆస్తి (ప్రస్తుతము ఖాళీస్థలము); దక్షిణం: సర్కారు డొంక / సర్కారు డొంక (స్పష్టంగా విర్వచిలేదు); పడమర: ప్లాట్ నెం.10 యొక్క ఆస్తి / ప్లాట్ నెం.10 యొక్క ఆస్తి (ప్రస్తుతము ఖాళీస్థలము); ఉత్తరం: చదలవాడ తిరుపతిరావు & ఇతరుల యొక్క ఆస్తి / చందవాడ తిరుపతిరావు & ఇతరుల యొక్క ఆస్తి. అక్షాంశము: 16.228969'N; రేఖాంశము: 80.620995'E.

రిజర్వుధర : రూ.9,50,000/- (అక్షరాల తొమ్మిది లక్షల యాభై వేల రూపాయలు మాత్రమే)
చెల్లించవలసిన బయానా : రూ.95,000/- (అక్షరాల తొంభై ఐదు వేల రూపాయలు మాత్రమే)

(సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8) చట్టం ప్రకారము ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారులు / సహపూచీదారులు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాల వ్యవధిని వినియోగించు కోగలరు.) (సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ (8) సబ్ రూల్ (6) క్రింద దీనిని నోటీసుగూ కూడా పరిగణించబడుతుంది) అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కర్ణాటక బ్యాంక్ యొక్క వెబ్‌సైట్ అనగా www.karnatakabank.com లో "mortgaged assets for sale" హెడ్ క్రింద సందర్శించండి.

ఇ-వేలము 05.02.2024 తేదీన ఉ॥ 11.00 గం॥ నుండి ఉ॥ గం॥ 11.20 ని॥ల వరకు www.auctionbazaar.com పోర్టల్ ద్వారా 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో నిర్వహించబడును. ఉద్దేశించిన బిడ్డర్ తమ పేరును M/s.ARCA Emart Pvt. Ltd. యొక్క వెబ్‌సైట్ www.auctionbazaar.com నందు నమోదు చేసుకొని, యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను ఉచితంగా పొందండి మరియు ఇ-వేలంపై శిక్షణను (తాత్కాలికంగా 02.02.2024 తేదీన) ఆన్‌లైన్ ద్వారా M/s.ARCA Emart Pvt. Ltd., 7-1-28/1/A/1, పార్క్ ఎవెన్యూ 1, అమీర్‌పేట, హైదరాబాద్, తెలంగాణ-500016, సంప్రదించవలసిన నెం: 9603716999 (శ్రావణ్ జి), 9581498999 (హర్ష జి.ఎ), 8370969696 (బి.శివరామకృష్ణ), Email-ID:- contact@auctionbazaar.com, support@auctionbazaar.com నుండి పొందవచ్చును.

తేది: 22.12.2023 / 26-12-2023, ప్రదేశం: హైదరాబాద్

సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్

సంపాదకీయం

కార్పొరేట్లకు నైవేద్యం

ప్రజల సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నించడం దారుణం. పాలకులు పన్ను రాయితీలు, రుణాల మాఫీలతోపాటు కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబ్‌లు, వాటిలో లోడ్ చేసిన కంటెంట్ కొనుగోలులో 1,250 కోట్ల రూపాయల కుంభకోణం చోటు చేసుకుందని తీవ్ర విమర్శలొచ్చాయి. జనం వద్దంటున్నా విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించి తీరుతామన్న ప్రభుత్వ పట్టుదల వెనుక కూడా అదానీ గ్రూప్, షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ వంటి కార్పొరేట్ ప్రయోజనాలే దాగున్నాయన్నది బహిరంగ రహస్యమే! శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల సముద్ర తీరంలోని అత్యంత విలువైన బీచ్‌శాండ్ మైనింగ్‌ను అదానీ సంస్థలకు కట్టబెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యత్నిస్తున్నాయి. ఆ మైనింగ్‌కు ప్రైవేటు రంగాన్ని అనుమతించాలంటూ ఈ ఏడాది మే 25న ముసాయిదా విడుదల చేయడం, చకచకా చట్టసవరణకు బిల్లు ప్రతిపాదించడం వెనుక కార్పొరేట్ల సేవ తప్ప వేరే ప్రయోజనమేదీ కనిపించదు. ప్రతిపక్ష సభ్యులంతా మణిపూర్ దారుణాలపై చర్చ జరగాలని పట్టుబడుతున్న సమయంలో ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టి పార్లమెంటులో ఆమోదింపజేసుకోవడం కేంద్ర ప్రభుత్వ 'కార్పొరేట్ సేవా తత్పరత'కు నిదర్శనం. ఇటీవల గౌతమ్ అదాని ముఖ్యమంత్రితో జరిగిన భేటీలో తీసుకున్న నిర్ణయం మేరకే రాష్ట్రంలోని బీచ్ శాండ్ మైన్స్‌లో 'ప్రాజెక్టు డెవలపర్ కమ్ ఆపరేటర్' పేరిట 92 శాతం వాటాను ఆఫర్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల టెండర్లు పిలిచిందన్న ఆరోపణలు సత్యదూరం కాదు. ఇప్పటికే రాష్ట్రంలోని కృష్ణపట్నం, గంగవరం పోర్టులు అదానీ పరమైనాయి. విశాఖ నగరంలో విలువైన స్థలాలను ఐటి అభివృద్ధి పేరిట అప్పగించారు. పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ అంటూ రాయలసీమ జిల్లాల్లోను, ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన చట్టాలను తుంగలో తొక్కి వేల ఎకరాలు కట్టబెడుతున్నారు. తాజాగా శారదా నదిపై దేవరాపల్లి మండలంలో మరో పంప్డ్ స్టోరేజి పవర్ ప్లాంట్ నిర్మాణానికి అదానీ గ్రూప్ యత్నాలు సాగిస్తోంది. బీచ్ శాండ్ మైనింగ్‌తో బంగాళాఖాతం తీరం నుండి తూర్పు కనుమల వరకు రాష్ట్రంలో అన్నిటా అదానీ సామ్రాజ్యం మరింతగా విస్తరిస్తుంది. అదానీ సేవలో తరించిపోతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్పొరేట్ అనుకూల విధానాలను జనం ప్రతిఘటించాలి.

'విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు' అంటూ పోరాడి 32 మంది యువకిశోరాల ప్రాణత్యాగంతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను జిందాల్‌కు కట్టబెట్టడానికి దొడ్డిదారిన ఫర్నేస్ నిర్వహణ పేరిట కేంద్రం ఒప్పందం కుదుర్చుకోవడం అత్యంత మోసపూరితం. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు గత వెయ్యి రోజులకుపైగా నిరసన దీక్షలు కొనసాగిస్తున్నారు. ట్రేడ్‌యూనియన్లు, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనలు సాగుతున్నాయి. కొత్తగా పెట్టుబడులు తెస్తాం... పరిశ్రమలు వస్తున్నాయని హోరెత్తించే నేతలు ఉన్న భారీ పరిశ్రమను ప్రభుత్వరంగంలో కొనసాగించేందుకు కృషి చెయ్యకపోతే ఎలా? ప్రయివేట్ స్టీల్ ప్లాంట్లకు సొంత ఉక్కు గనులు కేటాయించిన కేంద్రం... ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేటాయించడంలేదు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని విదితమవుతోంది. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రజల సంపద. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయివేట్‌పరం కానివ్వరాదు. ఢిల్లీ రైతు ఉద్యమ స్ఫూర్తితో స్టీల్ ప్లాంట్ వద్ద సుదీర్ఘ కాలంగా కార్మికులు దీక్ష సాగించడం అభినందనీయం. విశాల శక్తుల సంఘీభావంతో అది మరింత ముందుకు సాగించాలి. ఉక్కు సాధనకు ఉద్యమం సాగించిన రీతిలోనే దాని పరిరక్షణకు మహోద్యమం సాగించడమే మన ముందున్న ఏకైక మార్గం. అలా మాత్రమే కేంద్ర ప్రభుత్వం మెడలు వంచడం సాధ్యమవుతుంది. ప్రజల సంపదను ప్రజలే కాపాడుకోవాలి. అందుకు సమైక్య, సంఘటిత ఉద్యమాలు, పోరాటాలు సాగించి కార్పొరేట్ రాబందుల నుండి దేశాన్ని ప్రజల సంపదను కాపాడుకోవాలి.

మహనీయుల మాట



'రాజ్యం ఉండగా స్వేచ్ఛ ఉండదు.
స్వేచ్ఛ ఉన్నప్పుడు రాజ్యం ఉండదు.'

విఐ లెనిన్,
'రాజ్యం- విప్లవం' (1919) అనే రచనల నుండి.

విశ్లేషణ

రష్యాపై పనిచేయని పశ్చిమ దేశాల ఆంక్షలు !

ఎం కోటేశ్వరరావు

ఉక్రెయిన్ మీద రష్యా ప్రారంభించిన సైనిక చర్య మంగళవారం 671వ రోజుకు చేరింది. .మే నెలలో బఖ్‌మత్ పట్టణాన్ని స్వాధీనం చేసుకున్న తరువాత మారింకా అనే మరో పట్టణాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రష్యా సోమవారం ప్రకటించింది. అబ్బే అలాంటిదేమీ లేదు, తమ సైనికులు ఇంకా అక్కడే ఉన్నారని ఉక్రెయిన్ మిలిటరీ అధికారి చెప్పాడు. తమ మీదకు వచ్చే క్షిపణులు, యుద్ధ విమానాలను కూల్చివేస్తున్నామని, విజయానికి చేరువలో ఉన్నామని జెలెనెస్కీ ప్రకటిస్తూనే ఉన్నాడు. కానీ తమ ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకుంటామన్న మాటలు కోటలు దాటుతున్నాయి తప్ప అడుగు ముందుకు పడటం లేదు. పశ్చిమదేశాల కారణంగా సంక్షోభం మూడవ సంవత్సరంలో కూడా కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ పోరులో ప్రత్యక్షంగా నిమగ్నమైన రష్యా-ఉక్రెయిన్లే కాదు ప్రపంచ దేశాలన్నీ అనేక విధాలుగా గుణపాఠాలు తీసుకుంటున్నాయి. ఇక ఆయుధ వ్యాపారులు, ఉత్పత్తిదారుల సంగతి చెప్పనవసరం లేదు. వాటిని ఎంత ఎక్కువగా అమ్ముకోవాలి, మరింతగా మారణకాండను సృష్టించేవిగా వాటిని ఎలా సానబట్టాలా అని చూస్తున్నాయి. ఈ పోరులో డ్రోన్లతో దాడులు ఎలా చేయవచ్చో ప్రపంచం నేర్చుకుంటున్నది. ఉక్రెయిన్ సరిహద్దులకు ఆవల రష్యా తన వ్యూహాత్మక అంశాలను మరోసారి విశ్లేషించుకొనే విధంగా నాటో కూటమి విస్తరణ పురికొల్పుతున్నది. కొత్త ఎత్తుగడలకు పుతిన్ తెరతీస్తాడు. అసలైన సమస్య ఎంతకాలం ఉక్రెయిన్ తట్టుకొని నిలబడుతుందనే ఆందోళన పశ్చిమ దేశాల్లో రోజురోజుకూ పెరుగుతోంది. రాజీకి సిద్ధమేగానీ రష్యా చేతిలోకి వెళ్లిన తమ ప్రాంతాల సంగతేమిటని జెలెనెస్కీ అడుగుతున్నాడు. ఒకటి కావాలంటే మరొకదాన్ని వదులుకోవాల్సి ఉంటుందని పరోక్షంగా అమెరికా సూచిస్తున్నట్లు వార్తలు. ఆ ప్రాంతాల గురించి మరిచిపోండి, పశ్చిమ దేశాలు ఎన్ని ఆంక్షలు పెట్టినా ఇంతకంటే జరిగే నష్టం మాకు ఉండదు, కావాలంటే రాజీ చర్చలకు నేను సిద్ధమే అని పుతిన్ చెబుతున్నాడు. ఇటు ఉక్రెయిన్ ఓడిపోయి, రష్యా మీద ఆంక్షలను ఎత్తివేసే పరిస్థితి వస్తే తమ పరువేంగాను అని నాటో కూటమి దేశాలు అనుకుంటున్నాయంటే అతిశయోక్తి కాదు. మరోవైపు పాలస్తీనా ప్రాంతమైన గాజాలో పరువు దక్కించుకొని బయటపడటం ఎలా అన్న సమస్య పశ్చిమదేశాలకు తలెత్తింది.

వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఫిన్లండ్, తరువాత స్వీడెన్ నాటోలో ప్రవేశించనున్నాయి. అంటే మరోవైపు నుంచి రష్యా సరిహద్దులకు నాటో మిలిటరీ, ఆయుధాలు చేరనున్నాయి. ఫిన్లండ్-రష్యా మధ్య 1,300 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. 2026 నాటికి ఎఫ్-35 ఐదవతరం యుద్ధ విమానాలను అది సమకూర్చుకోనుంది. అమెరికాలో ఎన్నికల కారణంగా అక్కడి నుంచి ఉక్రెయిన్‌కు వచ్చే సాయానికి అంతరాయం కలిగితే ఆ ఖర్చును తట్టుకొనేదెలా అని ఐరోపా దేశాలు తలలు పట్టుకుంటున్నాయి. వలసలను అనుమతించరాదంటూ మితవాద శక్తులు ప్రతి దేశంలోనూ జనాన్ని రెచ్చగొడుతున్నాయి, ఎన్నికల్లో వాటికి మద్దతు పెరుగుతోంది. తాము మిలిటరీ సాయాన్ని నిలిపివేస్తున్నట్లు స్లోవేకియా ప్రకటించింది..అమెరికా, ఐరోపా ధనికదేశాలు కోరుకున్న విధంగా రష్యా మీద విధించిన ఆంక్షలు ఫలితాలనివ్వటం లేదు.

ఆంక్షలు విధించిన తరువాత 2023లో రష్యా రేవుల ద్వారా సరకు రవాణా 7.8శాతం పెరిగినట్లు సమాచారం తెలుపుతున్నది. బాల్టిక్ సముద్రాన్ని నాటో సరస్సుగా పశ్చిమ దేశాలు ప్రకటించినా ఆ ప్రాంత రేవుల ద్వారా కూడా రెండున్నర శాతం సరకు రవాణా పెరిగింది. వీటిలో చైనాకు చమురు కీలక పాత్ర పోషించింది. 2019లో తొలి వాణిజ్య రవాణాలో 22లక్షల పీపాల చమురు ఎగుమతి జరగ్గా, 2023లో 104లక్షలకు పెరిగింది. పశ్చిమదేశాల వ్యూహాలను, రష్యాపై విధించిన ఆంక్షలను చూసిన తరువాత సూయజ్ కాలువ ద్వారా జరుగుతున్న రవాణాను మరో మార్గానికి మళ్లిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని చైనా భావిస్తోంది. రష్యా కూడా ప్రత్యామ్నాయాల గురించి ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నది. ఉత్తర ధ్రువ కేంద్రం ఉన్న ఆర్కిటిక్ సముద్ర ప్రాంతరేవుల ద్వారా రవాణాలో మూడో వంతుదూరం, సమయం, ఖర్చు కూడా కలసి వస్తుంది. సూయజ్ కాలువ మాదిరి దాటేందుకు సుంకం చెల్లించాల్సిన అవసరంగానీ, వేచి ఉండాల్సిన పరిస్థితిగానీ, సముద్రపు దొంగల బెడదా ఉండదు. అయితే ఊహించని వాతావరణ, మంచు సమస్యలు తలెత్తే అవకాశం ఉంది, బహుశా దీన్ని ఊహించే అమెరికా కూడా అలాస్కా, గ్రీన్‌లాండ్ ప్రాంతంలో ఇప్పుడున్న మిలిటరీ కేంద్రాలను మరింతగా పటిష్టపరుస్తున్నది, నార్వేలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నది. రష్యాను దెబ్బతీసే వ్యూహంలో భాగంగా ఫిన్లండ్, నార్వేలతో మిలిటరీ సహకారాన్ని పెంచుకుంటున్నది.ఆర్కిటిక్ ప్రాంతంలో తన సరిహద్దుల నుంచి రెండువందల నాటికల్ మైళ్లకు (370 కిలోమీటర్లు) ఆవల కూడా తమకు హక్కు ఉందని అమెరికా కొత్తగా వివాదాస్పద ప్రకటనగావించింది. సముద్ర చట్టాల ఐరాస ఒప్పందంలో ఇంతవరకు అది భాగస్వామి కాదు.

పశ్చిమ దేశాల అండచూసుకొని ఉక్రెయిన్ ఎన్నిబెదిరింపులకు పాల్పడినప్పటికీ ఇటీవలి కాలంలో నల్లసముద్రం, అజోవ్ సముద్రాలలో రష్యా ఓడల రవాణా 17.2శాతం పెరిగింది. నాటో రష్యా మీద విధించిన ఆంక్షలను సభ్యదేశమైనప్పటికీ టర్కీ పాలకులు అమలు చేయటం లేదు, నాటోతో నిమిత్తం లేకుండా రుమేనియాతో పాటు టర్కీ, బల్గేరియా ఒక ఒప్పందం చేసుకొని మందుపాతరలను తొలగించేందుకు పూనుకున్నాయి.అమెరికా, ఐరోపా దేశాల ఎత్తుగడలను పసిగట్టిన వ్లదిమిర్ పుతిన్ నల్లసముద్ర తటస్థ జలాల మీద కాపలా కాసేందుకు హైపర్‌సోనిక్ క్షిపణులతో కూడిన జట్ విమానాలను మోహరించాలని అక్టోబరు నెలలో ఆదేశించాడు. సూయజ్ కాలువ ద్వారా కంటే తక్కువ దూరం ఉండే జలమార్గం కాస్పియన్ సముద్రం నుంచి ఉంది.దాన్ని పూర్తిగా వినియోగించుకొనేందుకు కొన్ని సమస్యలు ఉన్నాయి. ఇరాన్, పర్షియన్ గల్ఫ్,మధ్య ఆసియా దేశాలు, పాకిస్థాన్, భారత్‌కు ఈ మార్గం నుంచి చేరటం దగ్గర అవుతుంది. ఈ సముద్ర తీరంలో ఉన్న తన నౌకాశ్రయాల నుంచి రవాణాను పెంచేందుకు రష్యా పూనుకుంది. ఇటీవల చేసుకున్న ఒప్పందం ప్రకారం ఇరాన్‌లో 162కిలోమీటర్ల రైలు మార్గాన్ని రష్యా నిర్మిస్తుంది.పసిఫిక్ ప్రాంత దేశాలతో రష్యా సరకు రవాణా 5.7శాతం పెరిగింది.రష్యా దూరప్రాచ్య రేవుల నుంచి ఇది జరిగింది. గతేడాది సెప్టెంబరులో చైనాలోని క్యాంగ్‌ఝౌ నుంచి రష్యా వ్లాడీవోస్టాక్ వరకు ఒక నౌకా మార్గాన్ని ప్రారంభించాయి. దీన్ని ఐస్ సిల్క్ రోడ్ అని పిలుస్తున్నారు. యూరేసియా ప్రాంతంతో మరింత సన్నిహితం కావటానికి ఇది తోడ్పడుతుందని భావిస్తున్నారు.వ్లాడీవోస్టాక్ నుంచి ఆర్కిటిక్ ప్రాంతంలోని వివిధ రేవులకు ఈ మార్గాన్ని చైనా పొడిగించవచ్చని వార్తలు.

ఉక్రెయిన్ సంక్షోభం ఎంతకాలం కొనసాగుతుందో అంతకాలం రష్యా మీద ఆంక్షలు కొనసాగుతాయి. వాటిని తప్పించుకొని గ్రీస్ ఓడలు ఇరాన్, రష్యా చమురు రవాణా చేయటాన్ని గ్రహించిన అమెరికా యజమానులను బెదిరించింది. దాంతో ఆ తలనొప్పి ఎందుకు అంటూ ఓడలు, టాంకర్లను అమ్ముకొని లాభాలు పొందుతున్నట్లు తేలింది. టాంకర్లకు డిమాండ్ పెరిగింది. గడచిన పన్నెండు నెలల్లో నాలుగు వందల కోట్ల డాలర్ల విలువగల 125 చమురు ట్యాంకర్లు, నౌకలను విక్రయించారు.

అయితే వాటిని కొన్నవారి పేర్లు వెల్లడికాకుండా జాగ్రత్తపడుతున్నారు. ఎక్కువ భాగం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన వారు కొనుగోలు చేసినట్లు తేలింది. తరువాత చైనా, టర్కీ, భారత్ ఉన్నాయి..మిలిటరీ రీత్యా ఆయుధనవీకరణ ఒకటైతే ఐరోపాతో దెబ్బతిన్న వాణిజ్యం, ఎగుమతులకు ప్రత్యామ్నాయ ప్రాంతాలను చూసుకోవటం తప్పనిసరి.ఆర్థికంగా చైనా పెద్ద మద్దతుదారుగా ఉంది. మనదేశం దీర్ఘకాలంగా రష్యాతో ఉన్న మిలిటరీ, ఆర్థిక సంబంధాలను కొనసాగించక తప్పని స్థితి.

పశ్చిమ దేశాల అండచూసుకొని ఉక్రెయిన్ ఎన్నిబెదిరింపులకు పాల్పడినప్పటికీ ఇటీవలి కాలంలో నల్లసముద్రం, అజోవ్ సముద్రాలలో రష్యా ఓడల రవాణా 17.2శాతం పెరిగింది. నాటో రష్యా మీద విధించిన ఆంక్షలను సభ్యదేశమైనప్పటికీ టర్కీ పాలకులు అమలు చేయటం లేదు బాల్టిక్ సముద్రాన్ని నాటో సరస్సుగా పశ్చిమ దేశాలు ప్రకటించినా ఆ ప్రాంత రేవుల ద్వారా కూడా రెండున్నర శాతం సరకు రవాణా పెరిగింది. వీటిలో చైనాకు చమురు కీలక పాత్ర పోషించింది.2019లో తొలి వాణిజ్య రవాణాలో 22లక్షల పీపాల చమురు ఎగుమతి జరగ్గా, 2023లో 104లక్షలకు పెరిగింది.

సమస్య

ట్రక్ డ్రైవర్ల వెతలు తీరేనా...? వేతనాలు పెరిగేనా...?

డిసెంబర్ 10 తేదీన కేంద్ర రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్లో ట్రక్ డ్రైవర్లకు మెరుగైన వాతావరణం కల్పించాలనే దృష్టితో 2025సం. నుండి నూతనంగా తయారుచేసే యన్2, యన్ 3 ట్రక్కుల డ్రైవర్ కేబిన్లో ఎయిర్ కండిషన్ తప్పనిసరిగా ఉండాల్సిందేని స్పష్టం చేసింది. దీనివలన వేడి వాతావరణంలో పనిచేసే డ్రైవర్లకు అలసట తగ్గి మరింత పని సామర్థ్యం పెరుగుతుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇది చాలా మంచి నిర్ణయం. దేశ రవాణాలో డ్రైవర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. దేశంలో 80 లక్షలకు పైగా ట్రక్ డ్రైవర్లు ఉన్నారు. వ్యవసాయ రంగం తరువాత మనదేశంలో అత్యధిక ఉపాధిని కల్పిస్తున్న రంగం రవాణా రంగం. భారత ట్రక్కింగ్ పరిశ్రమ, దేశ ఆర్థిక వ్యవస్థ యొక్క శక్తి కేంద్రంగా ఉంది. జి.డి.పికి 6 శాతానికి పైగా దోహదం చేస్తుంది మరియు మిలియన్ల మందికి జీవనోపాధిని అందిస్తుంది. డ్రైవర్లు చాలా దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. వారికి ఆహారము, నిద్ర, విశ్రాంతి తీసుకోడానికి తగు సమయం దొరకడం లేదు. డ్రైవింగ్ సమయంలో వారు నడుపుతున్న ట్రక్కే వారికి ఇల్లు. ఇంకా జాతీయ రహదారుల్లో ట్రక్కుల డ్రైవర్లు చాలా సవాళ్ళను ఎదుర్కుంటున్నారు. ఈ సమస్యలను పరిష్కరించి వాళ్లకి నాణ్యమైన డ్రైవింగ్ అనుభవాన్ని, జీవితంపై భరోసా ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉంది. 2022 నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం, భారతదేశం తన దేశీయ సరుకులో 70% రోడ్డు మార్గం ద్వారా రవాణా చేయబడుతుంది. భారతీయ రహదారులపై తిరుగుతున్న ట్రక్కుల సంఖ్య 2022లో 4 మిలియన్ల నుండి 2050 నాటిడిసెంబర్ 10 తేదీనకి 17 మిలియన్లకు చేరుకుందని నివేదికలు చెబుతున్నాయి. 2.2 ట్రిలియన్ టన్నుల-కిమీగా ఉన్న ఈ ప్రస్తుత డిమాండ్ 2050 నాటికి నాలుగు రెట్లు అనగా 9.6 ట్రిలియన్ టన్నుల-కిమీకి పెరుగుతుందని అంచనా. భారతదేశంలో 2.8 మిలియన్ల ట్రక్కులు సంవత్సరానికి 100 బిలియన్ కిలోమీటర్లకు పైగా ప్రయాణిస్తాయి. ట్రక్కులు వాల్యూమ్ ప్రకారం రహదారి వాహనాలలో 2 శాతం మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

ఎదుర్కొంటున్న సవాళ్లు

ఏది ఏమైనప్పటికీ, ఈ అభివృద్ధి చెందుతున్న రంగం సంక్లిష్టమైన సవాళ్ల శ్రేణిని ఎదుర్కొంటున్నది. ప్రతి ఒక్కటి పరిష్కారానికి ప్రత్యేకమైన విధానాన్ని కోరుతుంది. జాతీయ రహదారులలో ప్రయాణం చేస్తున్న ట్రక్ డ్రైవర్లు సరుకులను తక్కువ కాలంలో సుదూర ప్రాంతానికి చేర్చాలని ఒత్తిడి ఉంటుంది. దీని మూలాన రోజులో ఎక్కువ గంటలు డ్రైవింగ్ చేయవలసి ఉంటుంది. ఈ కారణాన్న వాహన వేగాన్ని పెంచుతారు. చాలా మంది డ్రైవర్లు రోజుకు 14 గంటల వరకు డ్రైవింగ్ చేస్తున్నట్లు కొన్ని పరిశోధనలో తేలింది. ప్రమాదాలు పెరగడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. గణాంకాలు చూస్తే భారతదేశంలో రోడ్డు ప్రమాదాలు 2022 వార్షిక నివేదక ప్రకారం 2022 లో మొత్తం రోడ్డు ప్రమాదాలలో 32.9 శాతం (1,51,997) మరియు మొత్తం మరణాలలో 35.7 శాతం (55,571) జాతీయ రహదారుల పైనే జరిగాయి. నాన్‌స్టాప్ ట్రావెల్ కారణంగా 50% ట్రక్ డ్రైవర్లు డ్రైవింగ్ సంబంధిత ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఎక్కువ గంటలు కూర్చోవడం వల్ల కూడా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయి. టైం లేకపోవడం లేదా వారికి అలవాటైన భోజనం దొరకక 70 శాతం కంటే ఎక్కువ మంది డ్రైవర్లు వేళకి ఆహారం తీసుకోవడం లేదు. ఇంకా ఊబకాయం, మస్క్యులోస్కెలెటల్ (ఎముకలు మరియు కండరాలు) సమస్యలు , అధిక రక్తపోటు, నిద్రలేమి, అధిక ఒత్తిడి స్థాయిలు, డీ హైడ్రేషన్ మొదలగు ఆరోగ్య సమస్యలను ఎదుర్కుంటున్నారు. చాలా మంది నిరక్షరాస్యులు కావడం వలన స్థానిక భాష తెలియకపోవడం వలన అనేక సమస్యలను ఎదుర్కుంటున్నారు. ప్రయాణం మధ్యలో అనారోగ్యానికి గురైతే ఆర్థిక పరిపుష్టి లేక సరైన వైద్యసేవలు పొందలేక పోతున్నారు. వాహనాలు మొరాయించినా, ప్రమాదాలకు గురైనా చాలా ఇబ్బందులు పడవలసి ఉంటుంది. కొన్ని మార్గాలలో దారి దోపిడీలు కూడా జరుగుతున్నాయి. ట్రక్కులలో సరుకును అపహరించుకు పోతున్నారు. దోపిడీ దారులకు అడ్డు తగిలితే డ్రైవర్లను హత్యలు కూడా చేయడానికి వెనుకాడడం లేదు. స్థానిక మద్దతు లభించడం లేదు. డ్రైవర్లు చాలా కాలం ఇంటికి దూరం కావడం వలన మానసిక అనారోగ్యానికి కూడా గురగుచున్నారు. ఇంకా అవాంఛిత లైంగిక కార్యక్రమాల వలన సుఖవ్యాధులు లేదా ఎయిడ్స్ వచ్చే అవకాశం ఉంది. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న డ్రైవర్లకు నెలవారీ జీతాలు ఉండవు. ట్రిప్పు వెళ్లిన రోజులకు మాత్రమే వేతనాలు పొందుతున్నారు. వీళ్లు కుటుంబాన్ని పోషించుకోలేక పోతున్నారు. దీని మూలాన యువత ఈ రంగాన్ని శాశ్వత ఉపాధి మార్గంగా ఎంచుకోడానికి వెనుకాడుతున్నారు. మన దేశంలో ట్రక్ డ్రైవర్ సగటు జీతం సంవత్సరానికి ?3,14,600 (నెలకు ?17,040), ఇది భారతదేశంలోని జాతీయ సగటు జీతం కంటే ?72,900 (-19%) తక్కువ. ఈ రంగంలో అధికారికీకరణ ఇప్పటికీ పరిపక్వ స్థాయిలలో లేనందున, ట్రక్కింగ్ యొక్క వాంఛనీయ సామర్థ్య వినియోగం కోసం నాణ్యమైన డ్రైవర్ల లభ్యత కూడా ఇటీవలి కాలంలో ఈ రంగాన్ని వేధిస్తుంది. భారతదేశంలో డ్రైవర్-టు-ట్రక్ నిష్పత్తి ఇప్పటికీ 1000కి 750 కంటే తక్కువగా ఉంది. ఇది భారతదేశంలోని 25% నుండి 30% ట్రక్కులు కొన్ని సమయాలలో డ్రైవర్లు లేకపోవడం వలన ఖాళీగా ఉండిపోతున్నాయి.

కేంద్ర ప్రభుత్వం వీరికి నెలవారీ జీతం వచ్చేటట్టుగా ట్రక్ యజమానులను ఒప్పించాలి. కనీస వేతనం అమలయ్యేటట్లు చూడాలి. హైవే పెట్రోలింగ్ పెంచి దారి పొడవునా వీరు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించాలి. డ్రైవర్లు కోసం రాత్రి పూట నిద్రించేందుకు వసతి సౌకర్యం ఏర్పాట్లు చేయాలి. హైవే ప్రక్కన ప్రతీ 400 కిలో మీటర్లుకు ప్రత్యేకంగా వీరికోసం ఆసుపత్రులు ను నెలకొల్పాలి. ప్రతీ ఒక్క డ్రైవర్ ప్రమాద బీమా పరిధిలోకి వచ్చేటట్లు చేయాలి. ఇవన్నీ ఒకే రోజున జరిగే పనులు కావు. క్రమ క్రమంగా డ్రైవర్లకు సౌకర్యాలు కల్పిస్తే మరింత నాణ్యమైన సేవలను పొందగలం.

- జనక మోహన రావు దుంగ
8247045230

సందర్భం

ఉక్కు సంకల్పానికి వెయ్యి రోజులు

ఎం జగ్గునాయుడు

ఆంధ్ర ప్రదేశ్‌కే మణిహారంగా ఉన్న విశాఖ ఉక్కు ఊపిరి తీసేయడానికి మోడీ ప్రభుత్వం స్ట్రాటజిక్ సేల్ పేరుతో 100శాతం అమ్మకానికి పెట్టింది. 2021 జనవరి 27న కేంద్ర కేబినెట్ ఈ నిర్ణయం ప్రకటించింది. అప్పటి నుంచి విశాఖ ఉక్కు కార్మికులు, కార్మిక సంఘాలు ఏకత్రాటిపై నిలిచి ఉక్కు పరిరక్షణ కు అలుపెరుగని పోరాటం సాగిస్తున్నారు. 2021 ఫిబ్రవరి12 నుండి ఉక్కు ముఖద్వారం కూర్మన్నపాలెం జంక్షన్‌లో నిరాహార దీక్షలు ప్రారంభించారు. వేలాదిమందిని సమీకరించి అనేక రూపాల్లో ఉద్యమం సాగుతోంది. స్టీల్‌ప్లాంటు సంస్థ కార్మికులదేకాదు. ఇది ప్రజల ఆస్థి.మనందరి హక్కు అంటూ వారి ఉద్యమానికి విశాఖ ప్రజలు గొంతు కలిపారు. జిల్లాలోని బిఎంఎస్ యేతర కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలన్నీ కలసి జెఏసిగా ఏర్పడి స్టీల్ పరిరక్షణ కు 2021 ఏప్రిల్ 2 నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద రిలేనిరాహార దీక్ష శిబిరం ప్రారంభించింది. అప్పటి నుంచి ఈ దీక్షా శిబిరం కొనసాగుతూనే ఉంది. ఈనెల27 నాటికి వెయ్యి రోజులు పూర్తి చేసుకుంటుంది.. జిల్లాలోని అన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు, కార్యాలయాల ఉద్యోగులు,కాంట్రాక్టు కార్మికులు దీక్షల్లో వున్నారు.చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, ఆటో, మున్సిపల్, ముఠా, బిల్డింగ్, తోపుడుబళ్లు, సెక్యూరిటీ, ఇంటిపనివారు, షాపులు, ట్రాన్స్‌పోర్టు, ఆశ, అంగన్‌వాడీ, మిడ్డేమీల్ తదితర అసంఘటిత రంగ కార్మికుల ఉద్యమానికి సంఘీభావం తెలిపారు.. యువజనులు, విద్యార్థులు, మహిళలు, బాలలు, కవులు, కళాకారులు, వికలాంగులు, దళితులు, గిరిజనులు, మేధావులు, న్యాయవాదులు, మధ్యతరగతి, అపార్టుమెంట్లు, కాలనీలు, బస్తీల ప్రజలందరి ఉద్యమంగా ఇది రూపుదాల్చింది. కోవిడ్ రోజుల్లో సైతం దీక్షలు కొనసాగడం ఈపోరాట ప్రత్యేకత.

విశాఖ స్టీల్‌ప్లాంటు అమ్మకాన్ని సంవత్సరంలో పూర్తిచేయాలని మోడీ ప్రభుత్వం భావించినా అది సాధ్యపడలేదు. కారణం ఉక్కు కార్మికుల సమైక్యపోరాటం.ఈ పోరాటానికి లభిస్తున్న విశాల మద్ధతు. రాష్ట్ర వ్యాప్త సంఘీభావ ఆందోళనలు.చివరకు ప్రైవేటీకరణ విధానాలను అమలు చేసే రాజకీయ పార్టీలు కూడా ప్లాంటు అమ్మకానికి వ్యతిరేకంగా స్పందించాయి.బిజెపిని ఒంటరి అయింది.మోడీ ప్రభుత్వం ప్రజల మందు ముద్దాయిగా నిలిచింది. అయినా ప్లాంటును నష్టాలపాల్జేసి అమ్మాలన్న కుట్రలను అది విరమించుకోలేదు.

దేశంలోని అన్ని ప్రభుత్వరంగ స్టీల్ పరిశ్రమలకు స్వంతగనులున్నాయి.జిందాల్, టాటా, బ్రహ్మణి స్టీల్స్ ప్రైవేటు సంస్థలకు గనులు కేటాయించారు. కానీ వైజాగ్‌స్టీల్‌కు మాత్రం ఇవ్వడంలేదు. దీనివలన విశాఖ ఉక్కు ఉత్పత్తి ఖర్చు ప్రతిటన్నుకు సుమారు 4వేలు అదనం అవుతోంది. స్టీల్‌ప్లాంటుకు ఏటా కోటి టన్నుల ఇనుపఖనిజం కిరండోల్, బచేరీలోని బైలదిల్లా గనుల నుండి ప్రభుత్వం సరఫరా చేయాలి. కానీ ఈ సంవత్సరం 40లక్షల టన్నులు మాత్రమే సరఫరా చేసింది.మిగతాది కుమారస్వామి, డిపాజిట్ దోనమలై గనులు బల్లారి నుండి తీసుకోమంటున్నది. దీనివలన రవాణా ఖర్చు పెరిగిపోయి, పరిశ్రమ నష్టాలు చవిచూస్తోంది. కోల్ సరఫరా, రైల్వే రేకులు కేటాయింపులోను ఆటంకాలు పెడుతోంది.కావాలని బ్లాస్ట్‌ఫర్నేస్-3ని 2022 జనవరి 27న మూసివేసింది.దీంతో సాలీనా 2లక్షల టన్నులు ఉత్పత్తి నిలిచిపోయి సంస్థ కష్టాల్లో పడింది.

విశాఖ ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం 3.2మిలియన్‌టన్నుల నుండి 7.3 మిలియన్ టన్నులకు విస్తరించింది. దీనికి అయిన ఖర్చు 18వేల కోట్ల రూపాయలు.కేంద్రం ఒక్కరూపాయి కేటాయించలేదు.

మోడీ ప్రభుత్వం కల్పిస్తున్న ఈ ఆటంకాల మధ్య గత 9నెలలకాలంలో ప్లాంటు 19వేలకోట్లు టర్నోవర్ సాధించింది. అయినా !2017 నుండి అమలు చేయాల్సిన కార్మికుల వేతన ఒప్పందాన్ని తొక్కిపట్టింది. అధికారులకు ఈనెల 50శాతం మాత్రమే జీతాలు ఇచ్చారు. పర్మినెంటు కార్మికులకు జీతాలు రావని బెదిరిస్తున్నారు. కాంట్రాక్టర్ల బిల్లులు ఆపేశారు. కాంట్రాక్టు కార్మికులకు 2నెలలుగా జీతాలు లేవు. అడ్వాన్సులు మాత్రమే ఇచ్చారు. మరోవైపు జిఎస్‌టి పేరుతో ప్రభుత్వం 3420 కోట్లు లాగేసుకుంది. ఎన్‌ఎండిసికి 2000 కోట్లు అప్పు తీర్చారు. బ్యాంకులకు రుణాలు, వడ్డీలు కడుతున్నారు.

ప్లాంటును పోస్కో, ఆదానీ తదితర కార్పొరేట్లకు టోకుగా అమ్మే ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఇపుడు జిందాల్ స్టీల్‌తో మోడీ ప్రభుత్వం చీకటి ఒప్పందం కుదుర్చుకుంది. ప్లాంటును ముక్కలు ముక్కలుగా వీరిచేతిలో పెట్టే వ్యూహంతో వుంది.

అన్యాయం ఎక్కడ జరిగినా ప్రశ్నిస్తానన్న జనసేన అధినేత ద్రోహం చేస్తున్న బిజెపి పంచన చేరారు. తన వారాహి విజయయాత్ర సభల్లో ఎక్కడా ప్లాంటుపై కేంద్రాన్ని నిలదీసిన దాఖలాలేదు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ తెలుగుదేశం పార్టీ, తమ ఎంపిల ద్వారా పార్లమెంటులో ప్రశ్నలు వేయడం తప్ప కేంద్రాన్ని నిలదీసిన స్థితిలేదు. ఇటీవల చంద్రబాబు తనయుడు లోకేష్ యువగళం పాదయాత్రలో కనీసం ఉక్కు దీక్షాశిబిరాన్ని సందర్శించలేదు. యువగళం ముగింపు సభలోనూ కేంద్రాన్ని పల్లెత్తుమాటనలేదు.మోడీగారి 2040 విజన్‌ను చంద్రబాబు ఆకాశానికెత్తారు. ఈ మూడు ప్రధాన పార్టీలు బిజెపి ప్రాపకం కోసం ఆరాటం, అధికార యావతప్ప ప్లాంట్ రక్షణ ఎడల చిత్తశుద్ధిలేదు. స్టీల్‌ప్లాంటు, ప్రభుత్వరంగాన్ని రక్షించకుండా ఈ పార్టీలు విశాఖపట్నం, ఉత్తరాంధ్ర, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడలేవు.

కేంద్రం మెడలు వంచాలంటే ఉక్కు రక్షణ పోరాటం ప్రజా ఉద్యమం కావాలి. ఈ లక్ష్యంతో సిపిఎం పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉక్కురక్షణ బైక్‌యాత్ర చేపట్టింది. ప్రజలు విశేషంగా స్పందించారు. దాదాపు 10వేలమందితో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద అక్టోబర్ 5న భారీబహిరంగసభ జరిగింది. సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఈసభలో పాల్గొన్నారు. ఇండియా వేదిక భాగస్వామ్య పక్ష పార్టీల మద్దతు కూడగట్టే కృషిజరుగుతోంది. రాష్ట్రంలోని బిజెపి యేతర మిగతా రాజకీయ పార్టీలు కూడా ఈబాధ్యత నిర్వర్తించాలి. లేకపోతే రాబోవు ఎన్నికల్లో వీరికి ప్రజలను ఓట్లడిగే నైతిక హక్కు ఉండదు. ఈఉద్యమ ప్రత్యేకత. ఈలక్ష్యం సాధించేవరకు వెయ్యిరోజులేకాదు ఎన్ని వందల రోజులైనా పోరాటం కొనసాగించాలన్నదే కార్మిక ప్రజాసంఘాల సంకల్పం.

వ్యాసకర్త విశాఖ జిల్లా కార్మిక, ప్రజా సంఘాల జెఏసి ఛైర్మన్
సెల్ : 9490098800

పంజాబ్, హర్యానాపై మంచుదుప్పటి

చండీగఢ్ : పంజాబ్, హర్యానాల్లో చలి పులి విజృంభిస్తోంది. మంగళవారం ఈ రెండు రాష్ట్రాల్లోనూ అత్యల్ప కనీస ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హర్యానాలోని హిసార్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కాగా, రోహ్‌తక్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 8.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఫతేహాబాద్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 6.9 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. పంజాబ్‌లోని పఠాన్‌కోట్, బటిండా, ఫరీద్‌కోట్, గురుదాస్‌పూర్, అమృత్‌సర్, లూథియానా, పాటియాలాల్లో వరసగా కనిష్ట ఉష్ణోగ్రతలు 6.5 డిగ్రీల సెల్సియస్, 6.4 డిగ్రీల సెల్సియస్, 7.5 డిగ్రీల సెల్సియస్, 7 డిగ్రీల సెల్సియస్, 7 డిగ్రీల సెల్సియస్, 8.2 డిగ్రీల సెల్సియస్, 8.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. ఈ రెండు రాష్ట్రాల ఉమ్మడి రాజధాని చండీగఢ్‌లో 8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. పొగ మంచు కప్పుకోవడంతో రహదారులపై విజిబిలిటీ తగ్గిందని అధికారులు తెలిపారు.

మధ్యప్రదేశ్‌లో ఘోర ప్రమాదం

- నలుగురు మృతి

భోపాల్ : మధ్యప్రదేశ్‌లో మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ధార్ జిల్లాలోని ఆగ్రా-ముంబయి జాతీయ రహదారిపై ఓ ట్రక్కు బ్రేక్ ఫెయిలై అదుపు తప్పింది. ముందున్న ఐదు వాహనాలపైకి దూసుకెళ్లడంతో మంటలు వ్యాపించాయి. ఆరు వాహనాలు కాలి బుడిదయ్యాయి. రాజ్‌గఢ్ జిల్లా తారాగంజ్‌కు చెందిన రాంప్రకాష్‌కుమార్ (40), ఆయన భార్య గీత (35), 15 ఏళ్ల కుమార్తె, అత్త జైదేవి (45) బింద్‌జిల్లా లాహర్ పట్టణానికి బయల్దేరారు. బైపాస్‌ను జెసిబి దాటుతోంది. దీంతో, కారు రోడ్డు పక్కన దించి, డ్రైవర్ పార్క్ చేశాడు. వెనుక నుంచి వచ్చిన ట్రక్కు కారును ఢీకొని, దానిపై బోల్తాపడింది. లారీ స్ప్రింగ్ విరిగిపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని గుణ ఎస్‌పి విజయకుమార్ ఖత్రి తెలిపారు. లారీడ్రైవర్, క్లీనర్ పరారయ్యారని చెప్పారు. రాంప్రకాష్, గీత అక్కడికక్కడే మరణించగా, జైదేవి, 15 ఏళ్ల బాలిక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారని తెలిపారు.

ఉక్రెయిన్ దాడిలో నౌక ధ్వంసం

- రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ

మాస్కో : ఉక్రెయిన్ బలగాలు జరిపిన వైమానిక దాడిలో క్రిమియాలోని రష్యా నౌక ధ్వంసమైనట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ మంగళవారం తెలిపింది. ఫియోడోసియా నగరంలో ల్యాండ్ చేసిన నొవొచెర్కాస్క్ నౌకను ఉక్రెయిన్ విమానం ప్రయోగించిన క్షిపణులు ఢీ కొట్టాయని పేర్కొంది. దాడి సమయంలో రెండు ఉక్రెయిన్ ఫైటర్‌జెట్‌లను ధ్వంసం చేసినట్లు వెల్లడించింది. గత కొన్ని నెలలుగా, ఉక్రెయిన్ దళాలు సముద్ర డ్రోన్‌లను వినియోగించి క్రిమియాపై దాడులు చేపట్టాయని పేర్కొంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ దాడులకు బాధ్యత వహించాలని తెలిపింది.

మూడు వర్ణాల సేవకే శూద్రులు!

- అస్సాం సిఎం బిశ్వశర్మ వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తన మనువాద బుద్ధిని మరోసారి చాటుకున్నారు. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులకు సేవ చేయడానికే శూద్రులు ఉన్నారంటూ ఆయన మంగళవారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాకు విడుదల చేసిన 48 సెకన్ల వీడియోలో ఈ వ్యాఖ్యలు చేశారు. క్షత్రియులకు పాలించే లక్షణాలు ఉంటాయంటూ ఆయన కీర్తించారు. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులకు సేవ చేయడమే శూద్రుల కర్తవ్యమని చెప్పారు. హిమంత వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కులాల మధ్య విద్వేషాలను రగిలించడానికే శర్మ ఈ వీడియో విడుదల చేశారంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సిపిఎం ఖండన

'హిమంత బిశ్వశర్మ వ్యాఖ్యలను మేం తీవ్రంగా ఖండిస్తున్నాం' అని సిపిఎం ఒక ప్రకటనలో తెలిపింది. బిజెపి మనువాద భావజాలాన్ని ఈ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తున్నాయని పేర్కొంది.

తెరపైకి మరో స్పైవేర్

- ఎన్‌ఎస్‌ఒకు ప్రత్యామ్నాయంగా కాగ్నైట్‌తో మోడీ ప్రభుత్వ ఒప్పందం!
- దేశంలో పనిచేస్తున్న నాలుగు అనుబంధ సంస్థలు

న్యూఢిల్లీ : ఇజ్రాయిల్ కంపెనీ ఎన్‌ఎస్‌ఓ విక్రయించిన పెగాసస్ కంటే తక్కువ స్థాయి కలిగిన స్పైవేర్ కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం గత కొద్ది నెలలుగా ఎదురు చూస్తూనే ఉంది. ఓ అనుబంధ కంపెనీకి మన దేశంలో కార్యాలయాలు ఉన్నట్లు తెలిసింది. నూతన స్పైవేర్‌పై రూ.986 కోట్లు ఖర్చు చేసేందుకు మోడీ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక మార్చిలోనే తెలియజేసింది. పెగాసస్ సైనిక శ్రేణి స్పైవేర్. ఫోన్ల సాయంతో అది లక్ష్యాలపై నిఘా పెట్టగలదు. పెగాసస్ లక్ష్యాలలో పాత్రికేయులు, రాజకీయ ప్రత్యర్థులు, ప్రభుత్వ విమర్శకులు, హక్కుల కార్యకర్తల ఫోన్ నెంబర్లు ఉన్నాయని ఫ్రెంచ్ మీడియా గతంలోనే బయటపెట్టింది.

పెగాసస్‌ను విక్రయించిన ఎన్‌ఎస్‌ఓ గ్రూపునకు ప్రత్యామ్నాయంగా కేంద్రం వెతుకుతున్న కంపెనీల జాబితాలో తాజాగా 'కాగ్నైట్' చేరింది. దీని మరో పేరు వెరియంట్. సైప్రస్‌కు చెందిన ఆరు ఆఫ్‌షోర్ సర్వీస్ ప్రొవైడర్ల నుండి బహిర్గతమైన 3.6 మిలియన్ల పత్రాలను పరిశీలించగా కాగ్నైట్‌కు ప్రపంచవ్యాప్తంగా 69 అనుబంధ సంస్థలు ఉన్నాయని, వాటిలో నాలుగు సంస్థలకు భారత్‌లో కార్యాలయాలు ఉన్నాయని తేలింది. పరిశోధనాత్మక జర్నలిస్టులతో కూడిన అంతర్జాతీయ కన్సార్టియంలో భాగంగా ఉన్న 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక ఈ విషయాన్ని వెల్లడించింది. వెరియంట్ సిఇఎస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, వెరియంట్ సైబర్ ఇంటెలిజెన్స్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, వెరియంట్ సిస్టమ్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, విట్నెస్ సిస్టమ్స్ సాఫ్ట్‌వేర్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ పేరిట ఈ నాలుగు భారతీయ అనుబంధ కంపెనీలు నడుస్తున్నాయి. కాగ్నైట్ కంపెనీ మన దేశంలో కాగ్నైట్ అనలిటిక్స్ ఇండియా పేరిట కార్యకలాపాలు నిర్వహించింది. దక్షిణ న్యూఢిల్లీలోని భికాజీ కామా ప్లేస్‌లో దీని ఛార్టర్డ్ అకౌంటెంట్ల కార్యాలయం ఉంది. వెరియంట్ సిఇఎస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో కాగ్నైట్‌కు సంబంధమే లేదని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. అక్కడ యాభై మంది సిబ్బంది పనిచేస్తున్నారు. కాగ్నైట్‌కు చెందిన నాలుగు భారతీయ అనుబంధ సంస్థల బ్యాలెన్స్ షీట్లను పరిశీలించగా వాటికి ఇజ్రాయిల్, హాంకాంగ్‌లోని కాగ్నైట్ విదేశీ అనుబంధ కంపెనీల నుండి గణనీయంగా ఆదాయం లభించిందని తెలిసింది.

ఉదాహరణకు 2021 మార్చి 31తో అంతమైన సంవత్సరంలో వెరియంట్ సిఇఎస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తనకు రూ.128.21 కోట్ల ఆదాయం లభించిందని, రూ.8.05 కోట్ల నికర లాభం ఆర్జించామని తెలిపింది. అదే సంవత్సరంలో అమెరికాలోని వెరియంట్ అమెరికాస్ కంపెనీకి, దాని హోల్డింగ్ కంపెనీకి అందించిన సేవలకు రూ.60.61 కోట్లు అందుకుంది. అంటే ఆ సంవత్సరంలో పొందిన మొత్తం ఆదాయంలో సగమన్న మాట. వెరియంట్ సిఇఎస్ ఇండియా ఇజ్రాయిల్‌లోని కాగ్నైట్ టెక్నాలజీస్ ఇజ్రాయిల్ లిమిటెడ్ అనే అనుబంధ సంస్థతో లావాదేవీలు జరిపింది. వెరియంట్ సిఇఎస్ ఇండియా హాంకాంగ్ అనుబంధ సంస్థకు సేవలు అందించినందుకు రూ.2.02 కోట్ల ఆదాయం పొందింది. అంతేకాదు... వెరియంట్ సిస్టమ్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ తన ఖర్చుల వివరాలు సరిగా వెల్లడించనందుకు ఆదాయపు పన్ను శాఖకు జరిమానాలు చెల్లించాల్సి వచ్చింది.

పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వండి

- ప్రధాని మోడీకి సిఎం రేవంత్, డిప్యూటీ సిఎం భట్టి విజ్ఞప్తి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని ప్రధాని నరేంద్ర మోడీకి తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పునర్విభజన చట్టం-2014 ప్రకారం... రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఒక్కో ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. మంగళవారం ఢిల్లీ లోక్ కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసంలో మోడీని రేవంత్, భట్టి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన దాదాపు 15 అంశాలపై ప్రధానికి రిప్రజెంటేషన్లు ఇచ్చారు. వివిధ రూపాల్లో రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన దాదాపు రూ.6,283 కోట్లను వెంటనే రిలీజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రేవంత్, భట్టి మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రం నుంచి పెండింగ్‌లో ఉన్న అన్ని అంశాలపై ప్రధాని మోడీతో చర్చించినట్లు తెలిపారు. శాఖల వారీ కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, అనుమతులు, హామీలపై రిప్రజెంటేషన్ ఇచ్చినట్లు వెల్లడించారు. పదేళ్ల పాలనలో గత బిఆర్‌ఎస్ సర్కారు ఆర్థిక అరాచకాన్ని సృష్టించిందని అన్నారు. బయ్యారంలో స్టీల్‌ప్లాంట్, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, యుపిఎ హయాంలో ఇచ్చిన ఐటిఐఆర్ ప్రాజెక్టు, హైదరాబాద్‌లో ఐఐఎం, రాష్ట్రానికి ఒక సైనిక్ స్కూలు ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశామన్నారు. నీటి పారుదల, విద్య, వైద్యం సహా అన్ని రంగాల్లో కేంద్ర సహకారాన్ని అందించాలని కోరినట్లు తెలిపారు. తమ విజ్ఞప్తులపై ప్రధాని సానుకూలంగా స్పందించారని, కేంద్రం నుంచి అన్ని సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ప్రజారోగ్య మరియు పురపాలక సాంకేతిక శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు నోటీసు
నం.ఎమ్ఎన్‌జి-టిడిపిఎల్/ఎయిమ్స్/2023-24, తేది : 23.12.2023
పని పేరు : మంగళగిరి- తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎయిమ్స్ వాటర్ సప్లయి పనులు చేపట్టుట. అంచనా విలువ : రూ.61.24 లక్షలు. ఆన్‌లైను ద్వారా టెండర్లు స్వీకరించుటకు ఆఖరి తేది : 02.01.2024 సా.5 గం.ల వరకు. టెండరు తెరుచు తేది : 02.01.2024 సా.5.10 లకు. మిగతా వివరములకు ఇ-మార్కెట్ ప్లేస్ www.e-procurement.gov.in నందు పొందవచ్చును.
సం/- సాంకేతిక కార్యనిర్వహణాధికారి,
DIPR No.12152/CL/ADVT/1/1/2021-22 ప్రజారోగ్య విభాగము, గుంటూరు

ముంబయి చేరిన విమానం

- మానవ అక్రమ రవాణా ఆరోపణలపై ప్రయాణికులను విచారిస్తున్న సిఐఎస్‌ఎఫ్

ముంబయి : మానవ అక్రమ రవాణా జరుగుతుందనే ఆరోపణలతో ఫ్రాన్స్‌లో నాలుగు రోజుల పాటు నిలిచిపోయిన ఎయిర్‌బస్ ఎ340 విమానం ఎట్టకేలకు భారత్‌కు చేరుకుంది. మంగళవారం తెల్లవారుజామున 4 గంటల తరువాత ఎయిర్‌బస్ ఎ340 ముంబయిలో ల్యాండయిందని అధికారులు తెలిపారు. ఈ విమానం పారిస్ సమీపంలోని వాట్రి విమానాశ్రయం నుంచి సోమవారం మధ్యాహ్నం 2:30 గంటలకు బయలుదేరింది. ముంబయిలో విమానం ల్యాండయిన తరువాత అందులోని ప్రయాణికులను సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్‌ఎఫ్) అధికారులు విచారిస్తున్నారు. రొమేనియన్ చార్టర్ కంపెనీ లెజెండ్ ఎయిర్‌లైన్స్ నిర్వహించే ఈ విమానం దుబాయ్ నుంచి మధ్య అమెరికా దేశమైన నికరాగ్వాకు బయలుదేరింది. మధ్యలో ఇంధనం కోసం ఫ్రాన్స్‌లోని వాట్రి విమానాశ్రయంలో దిగింది. ఇదే సమయంలో మానవ అక్రమ రవాణా ఫిర్యాదు రావడంతో ఫ్రాన్స్ అధికారులు విమానాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ విమానంలో మొత్తం 303 మంది ప్రయాణికులు ఉండగా, వీరిలో అత్యధికులు భారతీయులే. ఫ్రాన్స్ అధికారులు తమ విచారణలో ప్రయాణికుల్లో 11 మంది మైనర్లు ఎలాంటి తోడు లేకుండా ప్రయాణం చేస్తున్నారని గుర్తించారు. విమానాన్ని నిలిపివేశారు. న్యాయపరమైన ప్రక్రియ పూర్తయిన తరువాత విమానం బయలుదేరడానికి ఫ్రాన్స్ కోర్టు అనుమతి ఇచ్చింది. కోర్టు అనుమతి రావడంతో ఈ విమానాన్ని దుబాయ్ కానీ, నికరాగ్వా కానీ పంపాలని ఫ్రాన్స్ అధికారులు భావించినా, భారతీయులు ఎక్కువగా ఉండటంతో భారత్‌కే పంపాలని చివరికి నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయంలో ఫ్రాన్స్‌కు అక్కడి భారతీయ రాయబార కార్యాలయం కృతజ్ఞతలు తెలిపింది. ఫ్రాన్స్ నుంచి ముంబయి బయలుదేరినప్పుడు విమానంలో 276 మంది ప్రయాణికులు ఉన్నారని అక్కడి అధికారులు తెలిపారు.

అమెరికాలో నివాసం ఉండాలనుకునేవారికి నికరాగ్వా ఒక గమ్యస్థానంగా మారింది. ఇక్కడ నుంచి అమెరికాలోకి అక్రమంగా, సులభంగా ప్రవేశించే అవకాశం ఉంది. అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ పెట్రోల్ (సిబిపి) సమాచారం ప్రకారం 2023 ఆర్థిక సంవత్సరంలో 96,917 మంది భారతీయులు అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించడానికి ప్రయత్నించారు. వీరిలో 41,770 మంది భారతీయులు మెక్సికన్ భూభాగం ద్వారా అమెరికాలో ప్రవేశించడానికి యత్నించారు. ప్రయాణ పత్రాలు సులభంగా లభించే నికరగ్వా లేదా అలాంటి దేశాలకు వెళ్లే విమానాలను 'డంకీ' విమానాలు అని పిలుస్తారు.

ఇజ్రాయిల్ ఎంబసీ సమీపంలో పేలుడు!

- ఆధారాల్లేవన్న పోలీసులు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఇజ్రాయిల్ రాయబార కార్యాలయ సమీపంలో పేలుళ్ల శబ్దం వినిపించాయన్న ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఇందుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవని దీనిపై విచారణ జరిపిన ఫోరెన్సిక్, ఇతర అధికారులు తెలిపారు. సాయంత్రం 6 గంటల సమయంలో చాణిక్యపురిలోని ఇజ్రాయిల్ ఎంబసీ సమీపంలో పేలుడు శబ్దం వినిపించినట్లు అగ్నిమాపకశాఖకు ఫోన్‌లో సందేశం వచ్చింది. పేలుడు శబ్దం వినిపించిందని, కిందికి చూసే సరికి పొగలు కక్కుతున్నాయని పోలీసులకు అక్కడి గార్డు తెలియజేశాడు.

ఎంబసీ అధికారులు కూడా పేలుడు శబ్బం వినిపించిందని చెప్పారు. దౌత్య సిబ్బంది అంతా క్షేమంగా ఉన్నారని, విచారణకు సహకరిస్తున్నారని ఎంబసీ ప్రతినిధి తెలిపారు. 2021లో ఇజ్రాయిల్ ఎంబసీ సమీపంలో పేలుడు సంభవించింది.

OFFICE OF THE RECOVERY OFFICER - I
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services,
Ministry of Finance, Government of India)
31-31-21, Sai Baba Street, Narayan Bhavanam,
Dabagardens, Visakhapatnam -530020

DEMAND NOTICE

(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME-TAX ACT, 1961)
RC / 1123 / 2017 27-10-2023
Union Bank of India (e-Andhra Bank), Gudivada Branch, Krishna District
Versus
Mr. Potluri Manasa Krishna & others

To
(CD-2) Mr. Uppalapati Ranga Rao, S/o. U. Narayana Rao, D.No. 13/266-1A, Patimeeda, Gudivada, Krishna District.

1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Hon'ble Presiding Officer, **DEBTS RECOVERY TRIBUNAL VISAKHAPATNAM in OA.No. 208 of 2014,** an amount of **Rs. 1,22,07,353/- (Rs. 61,15,308/- & Rs. 60,92,045/-)** along with pendentellite and future interest **@ 13.50% p.a.** compounded with quarterly rests from 28-04-2014 till realization / date of payment and the costs of **Rs. 1,60,000/-** (Rupees One Lakh and Sixty Thousand only) has become due against you (Jointly and Severally / Fully / Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned **on 31/01/2024 at 10.30 a.m.** for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay :
a) Such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings.
b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.
6. Attention is invited to Rule 16 of the second schedule to the Income Tax Act, 1961 which is reproduced below :
16 (1) Where a notice has been served on a defaulter under Rule 2, the defaulter or his representative in interest shall not be competent to mortgage, charge, lease or otherwise deal with any property belonging to him except with the permission of the Recovery Officer, nor shall any Civil Court issue any process against such property in execution of a decree for the payment of money.
16 (2) Where an attachment has been made under this Schedule, any private transfer or delivery of the property attached or of any interest therein and any payment to the defaulter of any debt, dividend or other moneys contrary to such attachment shall be void as against all claims enforceable under the attachment.
(Given under my hand and the seal of the Tribunal, on this day 27th October 2023)
(Avasarala Anil)
Recovery Officer
Debts Recovery Tribunal, Visakhapatnam

ఇడి అధికారిపై తమిళనాడులో కేసు విచారణ ఢిల్లీకి బదిలీ

చెన్నై : తమిళనాడు పోలీసులకు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి)కి మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. అవినీతి ఆరోపణలతో తమిళనాడు పోలీసులు అరెస్టు చేసిన తమ డిపార్ట్‌మెంట్ అధికారి అంకిత్ తివారీపై ఇడి కొత్తగా కేసు నమోదు చేసింది. ఇడికి చెందిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టిఎఫ్) తివారీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఇసిఐఆర్) బుక్ చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే ముందు ఇసిఐఆర్‌ను నమోదు చేస్తారు. ఎస్‌టిఎఫ్ ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీలో ఉన్న కారణంగా ఈ కేసు అక్కడికి బదిలీ చేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. ఒక డాక్టర్ నుంచి రూ.20 లక్షలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలతో ఇడి మధురై అధికారి అంకిత్ తివారీని దిండిగల్‌లో ఈ నెల ప్రారంభంలో తమిళనాడు చెందిన డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ (డివిఎసి) అరెస్టు చేసింది. తరువాత డివిఎసి అధికారులను విధుల నిర్వర్తించకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలతో మధురై ఇడి సబ్-జోనల్ ఆఫీస్ అసిస్టెంట్ డైరెక్టర్‌తో సహా 14 మందిపై తమిళనాడు పోలీసులు కేసు నమోదు చేశారు. డివిఎసి సిబ్బంది తమ కార్యాలయంలో చట్ట విరుద్ధంగా చొరబడ్డారని, కీలకమైన రహస్య పత్రాలను దొంగిలించారని తమిళనాడు డిజిపి శంకర్ జివాల్‌కు ఇడి ఫిర్యాదు చేసింది.

4.5 తీవ్రతతో లెహ్, లడఖ్ ప్రాంతంలో భూకంపం

లడఖ్ : లెహ్, లడఖ్ ప్రాంతలో 4.5 తీవ్రతతో మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో భూప్రకంపనలు సంభవించాయి. కొండ ప్రాంతాల్లో ప్రకంపనలు వచ్చాయని, లెహ్, లడఖ్‌లో భూమికి 5 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్టు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ ప్రకటించింది. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా వివరాలు వెల్లడించింది. దేశంలో ఏదో ఒక ప్రాంతంలో నమోదవుతున్న భూప్రకంపనలు ఆందోళనలు కలిగిస్తున్న విషయం తెలిసిందే.

అంతా సిద్ధం

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభకు కాకినాడ ముస్తాబు
- నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

ఈ నెల 27, 28, 29 తేదీల్లో కాకినాడలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించనున్న ఎస్‌ఎఫ్‌ఐ 24వ రాష్ట్ర మహాసభకు కాకినాడ ముస్తాబైంది. సభ జరగనున్న ప్రాంతానికి అల్లూరి సీతారామరాజు నగర్, ధీరజ్ ప్రాంగణంగా నామకరణం చేశారు. 26 జిల్లాల నుంచి 500 మంది ప్రతినిధులు ఈ మహాసభల్లో పాల్గొని విద్యారంగ సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించనున్నారు. మొదటిరోజు బుధవారం ఉదయం 10 గంటలకు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం జెండాను ఆవిష్కరించి రాష్ట్ర మహాసభను ప్రారంభిస్తారు. అనంతరం అమరవీరులు అల్లూరి సీతారామరాజు, ధీరజ్, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎంఎల్‌సి షేక్ సాబ్జి, మల్లు స్వరాజ్యం తదితరులకు నివాళులర్పిస్తారు. అనంతరం 24వ రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షుడు జెఎన్‌టియుకె విసి ప్రొఫెసర్ జివిఆర్ ప్రసాద్ రాజు, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు ప్రారంభ సభలో ప్రసంగిస్తారు. పిడిఎఫ్ మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం ముఖ్యవక్తగా పాల్గొంటారు. రాష్ట్రంలో వివిధ సందర్భాల్లో జరిగిన విద్యార్థి ఉద్యమాలపై రాష్ట్ర కార్యదర్శి నివేదిక ప్రవేశపెడతారు. జిల్లాల వారీగా ప్రతినిధులు గ్రూపు చర్చల్లో పాల్గొంటారు. రెండో రోజు విద్యార్థులు, గిరిజనులు, సోషల్ మీడియా, సంక్షేమ హాస్టళ్లు, కేంద్రీకరించిన కళాశాలలు, కమిటీలు వంటి రంగాల వారీగా చర్చలు జరగనున్నాయి. ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు ముఖ్య వక్తగా పాల్గొంటారు. మూడో రోజు భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఆనంద భారతి గ్రౌండ్ నుంచి మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్ వరకు విద్యార్థి కవాతు, ప్రదర్శన, బహిరంగ సభ జరగనుంది. ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత, రాష్ట్ర నాయకులు ప్రసంగిస్తారు.

ఇరానియన్ మిలిటెంట్ గ్రూప్‌పై ప్రతీకార దాడులు

- అమెరికా మిలటరీకి బైడెన్ ఆదేశం

వాషింగ్టన్ : ఇరాన్ మద్దతు గల మిలిటెంట్ గ్రూప్‌పై ప్రతీకార దాడులు చేపట్టాలని అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఆ దేశ మిలటరీని ఆదేశించారు. ఇరాన్ మిలిటెంట్ గ్రూప్ కతియాబ్ హిజ్బుల్లా, అనుబంధ సమూహాలు వినియోగించే మూడు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఓ అధికారి తెలిపారు. ఉత్తర ఇరాక్‌లో సోమవారం తెల్లవారుజామున జరిగిన డ్రోన్ దాడిలో ముగ్గురు అమెరికా సైనికులు గాయపడినట్లు సమాచారం. వారిలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారని జాతీయ భద్రతా మండలి (ఎన్‌ఎస్‌సి) ప్రతినిధి అడ్రియన్ వాట్సన్ తెలిపారు. ఇరాన్ మిలిటెంట్ గ్రూప్ కతియాబ్ హిజ్బుల్లా, అనుబంధ సమూహాలు ఈ దాడికి బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటించాయి. జాతీయ భద్రతా సలహాదారు జేక్ సుల్లివన్ ఇచ్చిన దాడి సమాచారంతో బైడెన్ ఈ దాడితో అప్రమత్తమయ్యారని, పెంటగాన్, అత్యున్నత అధికారులతో సమావేశం నిర్వహించారని సమాచారం.

Home First Finance Company India Limited,
CIN: L65990MH2010PLC240703,
Website: homefirstindia.com
Phone No.: 180030008425 Email ID: loanfirst@homefirstindia.com

ప్రైవేట్ ఒప్పందం ద్వారా విక్రయ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ యాక్ట్, 2002 (రూల్ 8(6) క్రింద నోటీసు) క్రింద సెక్యూర్డ్ అసెట్స్ విక్రయం.
హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్ అధీకృత అధికారిగా దిగువసంతకందారుడు బాకీ ఉన్న వాటికి సంబంధించి సబ్జెక్ట్ చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం షెడ్యూల్స్ ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. దయచేసి దిగువ పేర్కొన్న మా నోటీసును చూడండి, మీరు మాకు చెల్లించవలసిన బకాయిలు అందులో పేర్కొన్న విధంగా రిజర్వ్ ధరను నిర్ణయించడం ద్వారా పేర్కొన్న వార్తాపత్రికలో వేలం నోటీసును ప్రచురించినట్లు మేము తెలియజేసాము. పేర్కొన్న తేదీలో షెడ్యూల్ చేయబడి వేలం జరిగింది. బిడ్డర్ లేకపోవడంతో వేలం విజయవంతం కాలేదు.
కంపెనీ బకాయిల చెల్లింపు కోసం కంపెనీకి అంగీకరించే నిబంధనల ప్రకారం, షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా సురక్షితమైన ఆస్తి(లు) ప్రైవేట్ ఒప్పందం ద్వారా **"ఎక్కడ ఉన్నది అక్కడే" మరియు "ఆధారం ఏమిటి"** ప్రాతిపదికన అమ్మకానికి అందుబాటులో ఉన్నాయని ప్రజలకు సమాచారం అందించబడింది. సబ్జెక్ట్ చట్టం మరియు నిబంధనల ప్రకారం, కంపెనీకి చెల్లించాల్సిన మొత్తాన్ని 15 రోజులలోపు డిశ్చార్జ్ చేయడానికి మిమ్మల్ని అనుమతించడానికి మేము మీకు ఈ నోటీసును జారీ చేస్తాము. ఈ నోటీసు యొక్క తేదీ మరియు షెడ్యూల్‌లో పేర్కొన్న ఆస్తులను తిరిగి తీసుకోండి, లేని పక్షంలో బాధ్యతలను విడుదల చేయడానికి ఆస్తులు విక్రయించబడతాయి. ఇది సబ్జెక్ట్ యాక్ట్ లేదా అమలులో ఉన్న ఇతర చట్టం కింద ఏదైనా కంపెనీకి లభించే ఇతర హక్కులకు ఎటువంటి పక్షపాతం లేకుండా ఉంటుంది.
సర్ఫేసీ/ చట్టం/రూల్స్ నిబంధనలకు అనుగుణంగా విక్రయం జరగాలి. ఆసక్తిగల పార్టీలు మరిన్ని వివరాలు/స్పష్టతలు మరియు వారి ఆఫర్‌లను సమర్పించడం కోసం అధీకృత అధికారిని సంప్రదించవచ్చు.

క్ర. సం	హామీదారుల పేరు/ఎకౌంట్ పేరు	ఆస్తి/ఆస్తి యజమాని యొక్క వివరాలు	డిమాండ్ నోటీసు నాటికి బకాయి మొత్తం (ఐఎన్ఆర్ లో)	విక్రయ నోటీసు తేది	న్యూస్ పేపర్	ఇ-వేలం తేది	రిజర్వు ధర (ఐఎన్ఆర్ లో)	అధీకృత అధికారి నంబర్
2.	రాజగోపాలం శ్రీనివాసన్, అమ్మల్ జానకి శ్రీనివాసన్	రా హౌ.నం.190/2, (డో.నం.8-31 వద్ద), గుంటుపల్లి గ్రామ పంచాయతీ, ఇబ్రహీంపట్నం, కృష్ణాజిల్లా, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-521241	14,31,760	23-11-2023	బిజినెస్ స్టాండర్డ్ + ప్రజాశక్తి (ఇంగ్లీష్ +తెలుగు)	25-12-2023	20,34,000	9491222189

SARFAESI చట్టం, 2002 క్రింద చట్టబద్ధమైన 15 రోజుల విక్రయ నోటీసు
నోటీసు తేది నుండి 15 రోజులలోపు డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని ఇ-వేలం తేదీకి ముందు నవీనమైన వడ్డీ మరియు అనుబంధ ఖర్చులతో పాటు చెల్లించాలని రుణగ్రహీత/హామీదారులకు దీని ద్వారా తెలియజేయబడతారు, లేని పక్షంలో ఆస్తి వేలం వేయబడుతుంది/విక్రయం చేయబడుతుంది మరియు బకాయిలు ఏదైనా ఉంటే, వడ్డీ మరియు ఖర్చుతో తిరిగి పొందవచ్చు.
తేది: 27.12.2023
ప్రదేశం: విజయవాడ
అధీకృత అధికారి ద్వారా సంతకం,
హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్

మోడీ విమర్శకులే టార్గెట్

- అమెరికాలో రహస్య ఆపరేషన్
- బిజెపి నేతల అండదండలు
- బయటపెట్టిన వాషింగ్టన్ పోస్ట్

న్యూఢిల్లీ : అమెరికాలో ప్రధాని నరేంద్ర మోడీని విమర్శిస్తున్న వారిపై ఓ రహస్య ఆపరేషన్ నడుస్తోంది. డిస్‌ఇన్ఫో ల్యాబ్ అనే సంస్థ ఈ ఆపరేషన్‌ను చేపట్టింది. వాస్తవానికి 2020 నుండే ఈ సంస్థ మోడీ విమర్శకులను లక్ష్యంగా చేసుకొని వివిధ పత్రాల ద్వారా, సామాజిక మాధ్యమాలలో పోస్టుల ద్వారా దుష్ప్రచారం సాగిస్తోందని వాషింగ్టన్ పోస్ట్ పత్రిక తెలిపింది. ఈ సంస్థ తనను తాను నిష్పాక్షిక పరిశోధనా సంస్థగా చెప్పుకోవడం విశేషం.

భారత్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న అంతర్జాతీయ కుట్రలో అమెరికా ప్రభుత్వ అధికారులు, పరిశోధకులు, మానవ హక్కుల గ్రూపులు, భారతీయ అమెరికన్లు భాగస్వాములుగా ఉన్నారని ఈ సంస్థ నిందించింది. ఈ ఆరోపణలకు తగిన ఆధారాలేవీ అది చూపలేదు. మోడీ అనుకూలురు అమెరికాలోని భారతీయులపై అవాకులు చవాకులు పేలుతున్నారని, ఈ ఆరోపణలన్నీ భారత్‌లోని సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతున్నాయని వాషింగ్టన్ టైమ్స్ తెలిపింది.

ఎక్కడిదీ ల్యాబ్?

డిస్‌ఇన్ఫో ల్యాబ్‌కు లెఫ్టినెంట్ కల్నల్ దివ్య శథపతి వ్యవస్థాపకుడు. ప్రస్తుతం దానిని ఆయనే నడుపుతున్నారు. ఈ అధికారికి రిసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ (రా) సంస్థతో సంబంధాలు ఉన్నాయి. ప్రారంభంలో ఈ సంస్థ సుమారు 12 మంది ప్రైవేటు కాంట్రాక్టర్లతో ఏర్పడింది. ఆ తర్వాత న్యూఢిల్లీ నుండి మకాం మార్చింది. మోడీ ప్రభుత్వాన్ని విమర్శించే విదేశీయుల పేరుప్రతిష్టలను దెబ్బతీసేందుకు రహస్య కార్యకలాపాలు నిర్వహిస్తోంది. బిజెపి, దాని అనుబంధ సంస్థల విమర్శలు, ఆరోపణలకు ఆన్‌లైన్‌లో ప్రాచుర్యం కల్పించడమే డిస్‌ఇన్ఫో ల్యాబ్ ప్రధాన ఉద్దేశం. ఇది బిజెపి సీనియర్ నేతలు, ఇంటెలిజెన్స్, సైనిక అధికారులతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తోంది.

డిస్‌ఇన్ఫో ఆరోపణలు

డిస్‌ఇన్ఫో ల్యాబ్ 28 నివేదికలను ప్రచురించింది. భారత్ లక్ష్యంగా బిలియనీర్ జార్జ్ సొరోస్, ముస్లిం బ్రదర్‌హుడ్, పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ వంటి సంస్థలు ఆర్థిక సాయం చేస్తున్నాయని ఈ సంస్థ తరచుగా చెబుతోంది. ఈ నిధులకు, అమెరికాలో మోడీని విమర్శిస్తున్న వారికి మధ్య సంబంధం ఉన్నదని ఆరోపిస్తోంది. వీరిలో డెమొక్రటిక్ పార్టీ సభ్యురాలు, అమెరికా ప్రతినిధి ప్రమీలా జయపాల్, భారతీయ అమెరికన్లు కూడా ఉన్నారని నిందించింది. డిస్‌ఇన్ఫో ల్యాబ్ నివేదికలను ప్రజల్లోకి తీసికెళ్లడంలో తాజిందర్ బగ్గా, సంజు వర్మ, కపిల్ మిశ్రా వంటి బిజెపి నేతలు కీలక పాత్ర పోషిస్తున్నారు. డిస్‌ఇన్ఫో ల్యాబ్ నివేదికలు అమెరికా శాసనకర్తలపై ప్రభావం చూపాయని, ఈ నేపథ్యంలోనే కుల వివక్ష, విపత్తు నిర్వహణ వంటి వివిధ అంశాలపై అక్కడ చర్చలు జరిగాయని వాషింగ్టన్ పోస్ట్ పత్రిక తెలిపింది. అయితే ఈ ఆరోపణలన్నింటినీ డిస్‌ఇన్ఫో ల్యాబ్ తోసిపుచ్చింది. తనకు ప్రభుత్వ సంస్థలతో సంబంధమే లేదని స్పష్టం చేసింది. తనది స్వతంత్ర సంస్థ అని, దుష్ప్రచారాన్ని ఎండగట్టడమే తన పని అని చెప్పుకుంది.

ANGEL ONE LIMITED
Regd. Off: 601, 6th Floor, Ackruti Star, Central Road, MIDC, Andheri East, Mumbai - 400093
SEBI Registration No (Stock Broker): INZ000161534

PUBLIC NOTICE

Sr. No.	Name	NSE Regn no.	BSE Reg no.	MCX Regn-no.	NCDEX Regn no.	ADDRESS
1	BOMMISETTY LEELA PRASANNA	AP0397380021	AP01061201141569	MCX/ AP/152223	125585	D No 9-10-102, Factory Road, Kothapet Guntur Kothapet (Guntur) Guntur Andhra Pradesh 522001
2	K P V MALATHI	AP0397459861	AP-01061201145105	MCX/ AP/155134	N/A	6-2-11 Rail Peta Nidubrolu,Guntur,Andhra Pradesh Rail Peta Guntur Andhra Pradesh 522124
3	PAILI RAVI	AP0397576911	N/A	N/A	N/A	2-89A Ampapuram Ambapuram Ambapuram Krishna Andhra Pradesh 521109

This is to inform/confirm that we have discontinued our Business Relations with the above mentioned Authorized Persons. Clients and General Public are warned against Dealing in with them in his/their capacity as our Authorized Persons and we hereby confirm that we will not be liable in any manner for any consequence of such dealings/deals.
Clients are requested to contact our centralized desk 022-3355 1111/4218/5454 or email us to support@angelbroking.com.

Date : 27.12.2023
Place : Andhra Pradesh
For ANGEL ONE LTD
Sd/-
Authorised Signatory

మీకోసం

బట్టలపై నూనె ఒలికితే ఉప్పు అద్దిన నిమ్మకాయ ముక్కతో రుద్దాలి.

జీవన సౌరభం

అజ్ఞానం కన్నా నిర్లక్ష్యమే ఎక్కువ నష్టాన్ని కలిగిస్తుంది.

కోడిపుంజు

పొద్దున్నే
కోడిపుంజు
కొక్కొరోకోమని
కూత కూసింది

చిట్టి టక్కుమని
నిద్ర లేసింది
పుస్తకం తెరిసింది
టక టక చదవ సాగింది
చక చక తయారయ్యింది
బడికి వెళ్ళింది

చిట్టి బడిలో
తోటి వాళ్లతో
స్నేహానికి చేయి చాచింది!

కోడిపుంజు ఊరిలో
తోటి పుంజులతో
కయ్యానికి కాలు దువ్వింది!

చిట్టి స్నేహితులకు
దగ్గరయ్యింది
కోడిపుంజు
శత్రువులకు దూరమయ్యింది

చిట్టి బడిలో
పాఠం నేర్చుకుంది.
కోడిపుంజు ఊరిలో
గుణపాఠం నేర్చుకుంది!

– అమ్మిన వెంకట అమ్మిరాజు,
పేరూరు, తెలంగాణ,
94407 08656.

తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో ఏడు తేడాలున్నాయి. కనిపెట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ

బి.శాన్వి,
5వ తరగతి,
అరవింద హైస్కూల్, కుంచనపల్లి, గుంటూరుజిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

శీతాకాలం.. ఇవి పాటిద్దాం..

రెండు తెలుగు రాష్ట్రాలు ప్రజలు చలితో వణికిపోతున్నారు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు తగ్గిపోతుండటంతో ప్రజలు రాత్రిళ్లు, అందులోనూ వేకువ జామున నిద్ర నుంచి లేవాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఉదయం చేసే పనుల్లో కొన్నింటిని రాత్రివేళల్లో పూర్తిచేయగలిగితే సమయం ఆదా అవుతుంది. ఇరు రాష్ట్రాల్లో శీతల ప్రాంతాలుగా ఉమ్మడి ఆదిలాబాద్, తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖ జిల్లాలు గుర్తింపు పొందాయి. మన్యం ప్రాంతాల్లో మంచు తెరలు తెరలుగా విపరీతంగా కురుస్తుండటంతో ఆ వాతావరణాన్ని వీక్షించటానికి సందర్శకులు కూడా పెరుగుతున్నారు. లంబసింగి, అరకు, పాడేరు, మారేడుమిల్లి, భైరవకోన, తనకోన, హార్సిలీహిల్స్ తదితర

ఏటేటా వచ్చేదే కదా శీతాకాలం అనుకుంటే పొరపాటే. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కరోనా మళ్లీ కోరలు చాస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లోనూ చలి తీవ్రంగా ఉంది. పొగమంచు కమ్మి ఉంటుండటంతో ఉదయం 7 గంటలు దాటినా బయటకు రావటానికి భయపడాల్సిన పరిస్థితులు ఉంటున్నాయి. రాత్రివేళల్లో గతేడాదితో పోలిస్తే (22 నుంచి 23 డిగ్రీలు) ఈ ఏడాది 20 నుంచి 19 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి.
బయటకు రావాలంటే తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇప్పటికే రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖతోపాటు వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ప్రాంతాలకు సందర్శకుల తాకిడి ఎక్కువగానే ఉంటోంది. ఈ కాలంలో ఆహార, ఆరోగ్యపరంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం.

చలిగాలులతో జాగ్రత్తలు సుమా...

సాయంత్రం 4 గంటల నుంచే చలిగాలులు వీస్తుండటం, ఉదయం ఏడుగంటలైనా తగ్గకపోవటంతో ఇళ్లల్లో పిల్లలు, వృద్ధులు, రోడ్లపై వెళ్లే వాహనదారులు చలికివణికి పోతున్నారు. పలుచోట్ల రహదారులు కనిపించనంతగా ఉదయం పూట మంచుతెరలు కప్పేస్తుండటంతో ప్రమాదాలు కూడా జరుగుతుండటం, కొందరు మృతిచెందటం, క్షతగాత్రులు కావటం వంటివి జరుగుతుండటంతో వాహనదారులు నెమ్మదిగా వెళ్లాలంటూ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఆరోగ్యం కాపాడుకోవాలి

ఈ కాలంలో వచ్చే ఫ్లూ జ్వరాలు, జలుబుతోపాటుగా ఇప్పుడు కోవిడ్ భయం తోడైనందున మరిన్ని జాగ్రత్తలు అవసరం. వీలైనంత వరకూ తాజాగా వండిన ఆహారాన్నే తినాలి. కార్బోహైడ్రేడ్లు అధికంగా ఉండే బియ్యం, చపాతి, కేక్‌లు వంటివి తగ్గించి తాజా పండ్లు, ధాన్యాలు, కూరగాయలు, డ్రైఫ్రూట్స్, దంపుడు బియ్యం, ఓట్స్, బ్రౌన్‌బ్రెడ్ వంటివి మేలు చేస్తాయి. క్యారెట్లు, ముల్లంగి, బంగాళా దుంపలు, ఉల్లి, అల్లం వంటివి కూడా ఆరోగ్యం మెరుగుదలకు దోహదం చేస్తాయి. ప్రొటీన్ అధికంగా ఉండే గుడ్లు, చేపలు, మాంసం, పాల ఉత్పత్తులు ఆరోగ్యాన్ని కాపాడతాయి. జింక్ ఎక్కువగా ఉండే మొక్కజొన్న, రాగి, క్వినోవా వంటి తృణధాన్యాలు;

విటమిన్ సి అధికంగా ఉండే కివి, టమాటా, జామ, నిమ్మ, బొప్పాయి, నారింజ వంటివి శరీరం ఆరోగ్యంగా ఉండటానికి దోహదపడతాయి.

రోగ నిరోధక శక్తికి...

వంటింట్లో లభించే దినుసులతో చేసిన కషాయాలతో కూడా రోగ నిరోధక శక్తి పెంచుకోవటంతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఇంట్లో తయారుచేసిన కషాయాలు, హెర్బల్ టీలు కూడా మేలు చేస్తాయి. రోజూ నాలుగు లేదా ఐదు తులసి ఆకులు తింటే జీర్ణశక్తి పెరుగుతుంది. దగ్గు, జలుబు నుంచి రక్షణ కోసం అల్లం వాడాలి. పసుపు, మెంతి, వెల్లుల్లిలో తినే ఆహారంలో భాగస్వామ్యం చేసుకుంటే యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

వ్యాయామంతో చురుకుదనం

ప్రతిరోజూ క్రమం తప్పకుండా కనీసం ఒక అరగంటైనా వ్యాయామం చేస్తూ శరీరం చురుకుదనంతో ఉంటుంది. ఇది అలవాటు చేసుకుంటూ శరీర బరువు నియంత్రణతోపాటుగా మొత్తంగా ఆరోగ్యం మెరుగుపడుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే...

- కరోనా భయం వెంటాడుతున్నందున ప్రయాణాల్లో మాస్కులు ధరించటం మేలు.
- ఉష్ణోగ్రత తగ్గినప్పుడు వైరస్ ఎక్కువ కాలం జీవించొచ్చు. ఇతరులకూ వ్యాపించే ప్రమాదం ఉంటుంది.
- శానిటైజర్, సబ్బుతో చేతులను శుభ్రపర్చుకోవాలి.
- వాతావరణంలో వైరస్ వ్యాప్తి తీవ్రంగా పెరిగితే బయటకు వెళ్లేటప్పుడు మాస్కు ధరించటం తప్పనిసరి.
- ఉదయం,రాత్రిళ్లు ఇంటి నుంచి బయటకు వెళ్లాల్సివస్తే స్వెట్టరు ధరించాలి
- తలకు టోపీ లేదా మఫ్లర్ వంటివి సుఖవంతంగా ఉంటాయి
- పడుకునేటప్పుడు ఉన్నితో తయారుచేసిన దుప్పట్లు కప్పుకోవటం ఉత్తమం.
- గ్రామీణ ప్రాంతాల్లోనైతే రగ్గులు వంటివి ఎంత చలినైనా తట్టుకుంటాయి.
- పొగ మంచు కురిసే సమయంలోనైతే శరీరం తడవకుండా మందపాటి దుస్తులు ధరించాలి
- జలుబు, దగ్గు, ఆయాసం, సైనస్ వంటి సమస్యలు ఉన్న వారు చలిలో బయటకు రాకుండా ఉండటమే మంచిది
- కాచి చల్లార్చిన నీటినే తాగటం మేలు.
- నిల్వవున్న ఆహార పదార్థాలు తినొద్దు.. వేడి వేడివి తినాలి
- ఈగలు వాలిన, వీధుల్లో (స్ట్రీట్‌ఫుడ్) మానేయటం మంచిది.
- ప్రతిరోజూ ఉదయం సూర్యకిరణాలు శరీరంపై పడేలా చూసుకుంటే అవసరమైన డి-విటమిన్ లభిస్తుంది
- శరీరం డీ హైడ్రేషన్‌కి గురికాకుండా సరిపడా నీటిని తాగాలి.
- సరిపడా నిద్ర పోవాలి. ఒత్తిడి తగ్గటంతోపాటుగా మెదడు చురుగ్గా పనిచేస్తుంది.

రంగవల్లి

పి.శ్రీలేఖ,
విజయవాడ.

15 నుండి 8 వచ్చేవరకు (మధ్య చుక్క)

ముగ్గులు పంపవల్సిన మా చిరునామా :
మెయిల్ ఐడి : jeevanapageps@ gmail.com
వాట్సాప్ : 83329 25496

మోడీ హఠావో - దేశ్‌కి బచావో

- 30న మేధో మథనం సదస్సు
- భారత రాజ్యాంగ పరిరక్షణ వేదిక నిర్ణయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'మోడీ హఠావో..దేశ్‌కి బచావో ...'నినాదంతో ఈ నెల 30న మేధోమథనం సదస్సు నిర్వహించాలని భారత రాజ్యాంగ పరిరక్షణ వేదిక నిర్ణయించింది. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు ప్రజలంతా కదలిరావాలని ఈ సందర్భంగా వక్తలు పిలుపునిచ్చారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మోడీ హఠావో- దేశ్‌కి బచావో పేరుతో డిశంబర్ 30న మేధోమదనం సదస్సును నిర్విహించాలనే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. భిన్న మతాలు, కులాలు, భిన్న సంస్కృతి, సాంప్రదాయాలు కలిగిన దేశ ప్రజల మధ్య మతోన్మాదంతో విద్వేషాన్ని పెంచుతూ కార్పోరేట్‌లకు సంపదను దోచి పెడుతున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు ప్రజలంతా సమాయత్తం కావాలంటూ పిలుపునిచ్చిన ఈ తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా కిసాన్ సంయుక్త మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు, పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజులు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పదేళ్లకాలంలో అదాని, అంబానీల కోసం బరితెగించి పనిచేస్తోంది తప్ప రైతులు, కార్మికులు, ఉద్యోగులు, సామాన్య ప్రజల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదని వారు విమర్శించారు. ఇప్పటికే రైల్వేలు, ఓడరేవులు, ఎల్ఐసి, విమానయానం, జాతీయరహదారులు, ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు చిన్న పిల్లలు ఆడుకునే మైదానాలను కూడా కార్పోరేట్‌లకు కట్టబెట్టిందని అన్నారు.

విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక, హోదా, రైల్వే జోన్, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజి, రాజధాని నిర్మాణం ఇలా అన్నింటిలో మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు.. కర్నాటకలో మేలుకో కర్నాటక పేరుతో బిజెపిని గద్దె దించినట్లే రాష్ట్రంలో కూడా మేలుకో ఆంధ్రుడా పేరుతో బిజెపిని దానికి మద్దతు ఇస్తున్న పార్టీలను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. మతోన్మాద బిజెపిని గద్దె దించేందుకు ఈ నెల 30న విజయవాడలోని సిద్దార్థ కళాశాల ఆవరణలో జరిగే మేధోమథనం సదస్సుకు రాష్ట్రంలోని రాజకీయపార్టీలు, ప్రజా సంఘాలు, సంస్థలు, మేధావులు ప్రజాతంత్ర వాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక హోదా సాదనసమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు, ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగ్‌రావు, రిటైర్ట్ ఐఎఎస్ అధికారి బంది శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు కెవివి ప్రసాద్, కౌలురైతు సంఘం నాయకులు పి జమలయ్య, భారత్ బచావో నాయకులు భాస్కర్‌రావు, మేలుకో ఆంధ్రుడు నాయకులు రమేష్ పట్నాయక్, రైతు కూలీ సంఘం నాయకులు ఝాన్సీ, ఐఎఫ్‌టియు నాయకులు పొలారి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న వడ్డే శోభనాద్రీశ్వరరావు, చలసాని శ్రీనివాసరావు తదితరులు

ఆదుకున్న రాహుల్

- అజేయంగా 70పరుగులు
- భారత్ 208/8
- దక్షిణాఫ్రికాతో తొలిటెస్ట్

సెంచూరియన్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలిటెస్ట్‌లో టీమిండియా మిడిలార్డర్ బ్యాటర్ కెఎల్ రాహుల్ అర్ధసెంచరీకి తోడు విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్ కూడా రాణించడంతో భారతజట్టు 8వికెట్ల నష్టానికి 208పరుగులు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఆదిలోనే కష్టాల్లోపడింది. 11.1 ఓవర్లలో 24పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఓపెనర్లు యశస్వీ జైస్వాల్(17), రోహిత్ శర్మ(5) తక్కువ స్కోర్‌కే పెవీలియన్‌కు చేరగా.. శుభ్‌మన్ గిల్(2)ను బర్గర్ ఔట్ చేశాడు. బౌలింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై రబాడ సఫారీలకు తొలి బ్రేక్ ఇచ్చాడు. రోహిత్‌ను వెనక్కి పంపాడు. ఆ కాసేటపికే యశస్వీని బర్గర్ ఔట్ చేశాడు. స్వల్ప వ్యవధిలో రెండు కీలక వికెట్లు పడిన భారత్‌ను విరాట్ కోహ్లీ(4), గిల్ ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ, బర్గర్ సూపర్ డెలివరీతో గిల్‌ను ఔట్ చేశాడు. అంపైర్ నాటౌట్ ఇవ్వడంతో రివ్యూ తీసుకొని మరీ వికెట్ సాధించింది. వికెట్ కీపర్ కెఎల్ రాహుల్(70బ్యాటింగ్) అర్ధసెంచరీతో ఆదుకున్నారు.. అశ్విన్(8) నిరాశపరిచినా.. శార్దూల్(24)తో కలిసి కెఎల్ రాహుల్ 7వ వికెట్‌కు 43పరుగులు జతచేశాడు. బుమ్రా(1)ను జెన్సన్ ఔట్ చేయడంతో టీమిండియా తొలిరోజే ఆలౌట్ అయ్యేలా కనిపించింది. సిరాజ్(0బ్యాటింగ్) కెఎల్ రాహుల్ కలిసి చివర్లో సఫారీ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. దీంతో టీమిండియా తొలిరోజు వెలుతురులేమి కారణంగా ఆటనిలిచే సమయానికి 59ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 208పరుగులు చేసింది. రబడాకు ఐదు, బర్గర్‌కు రెండు, జెన్సన్‌కు ఒక వికెట్ దక్కాయి.

కెఎల్ రాహుల్ (70 నాటౌట్)

ఆదుకున్న కోహ్లి, శ్రేయస్

24పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ టీమిండియాను విరాట్ కోహ్లి(38), శ్రేయస్ అయ్యర్(31) ఆదుకున్నారు. వీరిద్దరూ 4 వికెట్‌కు 68పరుగులు జతచేశారు. తొలుత ఆచి తూచి ఆడినా.. వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు బాదారు. శ్రేయస్ ధాటిగా ఆడగా.. విరాట్ నెమ్మదిగా ఆడాడు. వీరు క్రీజ్‌లో నిలదొక్కుకోవడంతో లంచ్ విరామానికి టీమిండియా 26ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 91పరుగులు చేసింది. లంచ్ తర్వాత రబడా వేసిన ఓ గుడ్‌లెంగ్త్ బంతికి శ్రేయస్ 31పరుగుల వద్ద బౌల్డ్ అయ్యాడు. దీంతో వీరి భాగస్వామ్యానికి తెరపడింది.

స్కోర్‌బోర్డు..

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)వెర్రియనే (బి)బర్గర్ 17, రోహిత్ శర్మ (సి)బర్గర్ (బి)రబడా 5, శుభ్‌మన్ (సి)వెర్రియనె (బి)బర్గర్ 2, కోహ్లి (సి)వెర్రియనె (బి)రబడా 38, శ్రేయస్ (బి)రబడా 31, కెఎల్ రాహుల్ (బ్యాటింగ్) 70, అశ్విన్ (సి)ముల్డర్ (బి)రబడా 8, శార్దూల్ (సి)ఎల్గర్ (బి)రబడా 24, బుమ్రా (సి)జెన్సన్ 1, సిరాజ్ (బ్యాటింగ్) 0, అదనం 12. (59ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 208పరుగులు.

వికెట్ల పతనం: 1/13, 2/23, 3/24, 4/92, 5/107, 6/121, 7/164, 8/191

బౌలింగ్: రబడా 17-3-44-5, జెన్సన్ 15-1-52-1, బర్గర్ 15-4-40-2, కొర్జే 12-1-53-0

కొనసాగుతున్న నంది నాటకోత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర స్థాయి నంది నాటకోత్సవాలలో భాగంగా నాలుగో రోజు వివిధ జిల్లాల నుంచి వచ్చిన కళాకారులు పలు నాటికలను ప్రదర్శించారు. గుంటూరు శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బలిజేపల్లి లక్ష్మీకాంతం కళావేదిక ద్వారా నిర్వహిస్తోన్న ఈ నాటకోత్సవాలలో పౌరాణిక కథాంశాలు, సాంఘిక, సామాజిక అంశాలతో పాటు విజ్ఞాన వినోదాల సమ్మేళనంగా ప్రదర్శనలు కొనసాగాయి. నాగశ్రీ రచనకు అన్నెపు దక్షిణామూర్తి దర్శకత్వం వహించిన 'సీతాకల్యాణం' పౌరాణిక పద్యనాటకాన్ని కాకినాడకు చెందిన సీతారామాంజనేయ నాణ్యమండలి ప్రదర్శించింది. కథనం క్రియేషన్స్, కొండపల్లి క్రాంతి హైస్కూల్ వారు ప్రదర్శించిన నాటిక 'తథాబాల్యం' ప్రేక్షకులను ఆకట్టుకుంది. జె.బి. ప్రిస్టి రచనలో ది ఇంపోస్టర్స్ (అంతా నిజమే చెబుతారు), హైదరాబాద్ మిత్రా క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఎన్.ఎం.బాషా రచించన ఆకురాతి భాస్కరాచారి దర్శకత్వంలో రూపొందిన 'ఇంకానా'?, పిన్నమనేని మృత్యుంజయ రావు రచనకు నాయుడు గోపీ దర్శకత్వంలో గంగోత్రి పెదకాకాని వారు 'ఆస్తికలు' నాటికను ప్రదర్శించారు. 'శ్రీ కృష్ణ – కమలపాలిక' పద్యనాటకంతో నాలుగోరోజూ ప్రదర్శనలు ముగిశాయి. ఎఫ్‌డిసి చైర్మన్ పోసాని కృష్ణమురళీ, మేనేజింగ్ డైరెక్టర్ విజయ్‌కుమార్ రెడ్డి నాటికలను వీక్షించారు. విజేతలకు బహుమతులు, పారితోషికం అందించారు.

కళాకారులకు పారితోషికం అందిస్తున్న పోసాని కృష్ణమురళి

గెలిచేవారికే సీటు : పెద్దిరెడ్డి

- మా నుంచి వెళ్లిపోయిన వారిని చంద్రబాబు గెలిపిస్తారా?

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

గెలిచేవారికే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సీటు అవకాశం కల్పిస్తున్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. చిత్తూరులో 'ఆడుదాం ఆంధ్రా' ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. తాము ఎమ్మెల్యేలను మార్చేస్తున్నామని, వైసిపికి ఓటమి భయం పట్టుకుందని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికల్లో గెలిచేవారికే సీటు ఇస్తున్నామని చెప్పారు. తమ నుంచి వెళ్లిపోయిన వారికి సీటిచ్చి చంద్రబాబు గెలిపిస్తారా? అని ఎద్దేవా చేశారు. సీటు ఇవ్వని వారికి భవిష్యత్‌లో మంచి అవకాశం కల్పిస్తామన్నారు.

నవీనుల్ హక్ ఫజల్ హక్ ముజీబ్ రెహ్మాన్

ముగ్గురు అఫ్ఘన్ ఆటగాళ్లకు ఎన్‌ఓసి నిరాకరణ

2024 ఐపిఎల్ సీజన్‌కు దూరం?

కాబూల్: ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ముగ్గురు ఆటగాళ్లకు ఆ దేశ క్రికెట్ బోర్డు 'నో అబ్జక్షన్ సర్టిఫికెట్'(ఎన్‌ఓసి) ఇచ్చేందుకు విముఖత చూపింది. పేసర్లు నవీనుల్ హక్, ఫజల్ హక్‌తోపాటు స్పిన్నర్ ముజీబ్ రెహ్మాన్‌కు వచ్చే రెండేళ్లపాటు ఎన్‌ఓసి ఇవ్వకూడదని ఆఫ్ఘన్ క్రికెట్ బోర్డు నిర్ణయించినట్లు సమాచారం. వీరు జాతీయ జట్టు కంటే లీగ్‌లకు ప్రాధాన్యం ఇస్తున్నారనే కారణంతోనే సెంట్రల్ కాంట్రాక్ట్‌నూ పొడిగించలేదు. దీనిపై అంతర్గత కమిటీని నియమిస్తూ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. కమిటీ తీసుకునే నిర్ణయం ఆధారంగానే బోర్డు తుది ఆదేశాలు ఉంటాయి. ఒకవేళ ముగ్గురు ఆటగాళ్లకు ఎన్‌వోసీ ఇవ్వకపోతే వచ్చే ఐపీఎల్‌లో ఆడటం అనుమానమే. ఐపిఎల్ వేలంలో ముజీబ్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్, ఫజల్‌హక్‌ను సన్‌రైజర్స్, నవీనుల్‌ను లక్నో సూపర్ జెయింట్స్ రిటైన్ చేసుకున్నాయి.

34మందితో మహిళల హాకీ జాతీయ శిక్షణ శిబిరం

భువనేశ్వర్: జాతీయ మహిళల హాకీ శిక్షణా శిబిరం 34మంది ఎంపికయ్యారు. వచ్చే ఏడాది జరగనున్న ఐదు దేశాల హాకీ టోర్నమెంట్‌కు జట్టును హాకీ ఇండియా(హెచ్ఐ) ఎంపిక చేయనుంది. సీనియర్ మహిళల హాకీ శిక్షణా క్యాంప్‌కు ఎంపికైన ఆటగాళ్లను హెచ్ఐ మంగళవారం ప్రకటించింది. వచ్చే ఏడాది రాంచీ వేదికగా జనవరి 13-19న ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ జరగనుంది. గ్రూప్-బిలో భారత్‌తోపాటు న్యూజిలాండ్, ఇటలీ, అమెరికా జట్లు ఉన్నాయి. ఇక గ్రూప్-ఎలో జర్మనీ, జపాన్, చిలీ, చెక్ రిపబ్లిక్ జట్లు ఉన్నాయి. జకార్తా వేదికగా జరిగిన మహిళల హాకీ ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. భారత్‌తోపాటు స్పెయిన్, బెల్జియం, జర్మనీ, ఐర్లాండ్ జట్లు టోర్నమెంట్‌లో ఆడనున్నాయి.

శిక్షణా శిబిరానికి ఎంపికైన ఆటగాళ్లు..

గోల్‌కీపర్లు: సవిత, రజని, బిచ్చూదేవి, బన్సారి సోలంకి

డిఫెండర్లు: దీప్ గ్రేస్ ఎక్కా, గుర్జీత్ కౌర్, నిక్కి ప్రధాన్, ఉదిత, ఇషికా చౌదరి, అక్షత దేహలే, జ్యోతి ఛత్రి, మహిమా చౌదరి

మిడ్‌ఫీల్డర్లు: నిషా, సలీమా, సుశీల, జ్యోతి, నవ్‌జ్యోత్ కౌర్, మౌనిక, మరీనా కుజుర్, నేహా, బల్జీత్ కౌర్, రీనా ఖోఖర్, వైష్ణవి విఠల్, అజ్మీనా కుజుర్.

ఫార్వర్డ్స్: లాల్‌రిమిసిమి, నవ్‌నీత్ కౌర్, వందన కటారియా, షర్మిలా దేవి, దీపిక, సంగీత కుమారి, ముంతాజ్ ఖాన్, సునీత టొప్పొ, బ్యూటీ డంగ్‌డంగ్.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68